ప్రజాశక్తి

మంగళవారం 16 జులై 2024 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా







చితికిన బతుకులు

- దొనబండ క్వారీలో జారిన బండరాళ్లు • ముగ్గురు కార్మికులు సమాధి
- సౌకర్యాల కల్పనలో క్రషర్, క్వారీ యజమానుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి-కంచికచర్ల

కార్మికుల జీవితాలు బండరాళ్ల మధ్య చితికిపోయాయి. ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్ల మండలం పరిటాల గ్రామ పరిధిలోని దొనబండ క్వారీలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు కార్మికులు అక్కడికక్కడే మృతిచెందారు. క్వారీలో బండరాళ్లకు డ్రిల్లింగ్ చేస్తుండగా పెద్ద మొత్తంలో బండరాళ్లు జారి పడటంతో జి.కొండూరు మండలం చెరువు మాధవరంకు చెందిన డ్రిల్లింగ్ యజమాని బత్తుల దుర్గా రాజ్ (23), ఒరిస్సా రాష్ట్రానికి చెంది ప్రస్తుతం జి.కొండూరు మండలం చెవుటూరు గ్రామంలో నివాసం ఉంటున్న డ్రిల్లర్ బిబి నాయక్ (42), ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెంది ప్రస్తుతం చెవుటూరులో నివాసం ఉంటున్న రామ్ దేవ్ భాగేల్ (33) అక్కడికక్కడే (మిగతా 2లో)

మృతుల కుటుంబాల్లో విషాదం

ప్రజాశక్తి-కంచికచర్ల

కంచికచర్ల మండలం దొనబండ క్వారీలో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన ముగ్గురు కార్మికుల కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. సోమవారం సాయంత్రం రాళ్ల గుట్టల నుండి మృతదేహాలను వెలికితీయడంతో ఆ ప్రాంతమంతా రోదనలు మిన్నంటాయి. కూలీ పనుల కోసం వెళ్లి సాయంత్రానికి డబ్బులు తెస్తారని ఎదురుచూస్తున్న ఆ కుటుంబాలకు తమ కుటుంబంలోని వ్యక్తి విగతజీవిగా మారటంతో ఆ కుటుంబాలు తల్లడిల్లాయి. క్వారీ ప్రమాదంలో మృతిచెందిన రాందేవ్ భాగేల్‌ది కడుపేద కుటుంబం. రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితి. రాందేవ్‌కు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. జి.కొండూరు మండలం చెవుటూరు శివారులోని క్వారీలలో ఈ కుటుంబం చిన్న గుడిసెలో నివాసం ఉంటుంది. రాందేవ్ కుమారుడు చనిపోయి కొద్దికాలం అవుతోంది. ఇప్పుడు కుటుంబానికి పెద్ద దిక్కు అయిన రాందేవ్ క్వారీలో జరిగిన ప్రమాదంలో మృత్యువాతపడ్డాడు. రాందేవ్ భార్య జయమని కూలీ పనులకు వెళ్తూ భర్తకు చేదోడు వాదోడుగా ఉంటుంది. ఇలా మృతుల కుటుంబాల్లో ఒక్కొక్కరిది ఒక్కో విషాద గాథ. కష్టపడి సంపాదించి కుటుంబానికి అండగా ఉంటున్న వారు మృత్యువాత పడటంతో ఆ కుటుంబాలు దిక్కుతోచని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. క్వారీ ప్రమాదంలో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు క్వారీ యజమానులు తగిన నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. క్వారీ ప్రమాదంలో ముగ్గురు కార్మికులు మృతిచెందిన దుర్ఘటనపై క్వారీ యజమానితో మృతుల బంధువులు, అధికారులు నష్టపరిహారంపై సంప్రదింపులు జరిపారు. మృతులందరూ రాష్ట్రాలు దాటి కూలీ పనుల కోసం వచ్చారని, వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీంతో క్వారీ యజమాని రామ్మోహన్‌రావు మృతుల కుటుంబాలు ఒక్కొక్కరికి రూ.8 లక్షలు నష్టపరిహారం అందించేందుకు అంగీకరించారు.

క్వారీలో ఘోరం

ప్రధాన వార్త మెయిన్‌లో



సిబ్బంది అభినందించి ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎస్‌పి నయీం అస్మి

యాచక వృత్తితో లబ్ధి పొందేందుకే...

శిశువు కిడ్నాప్ కేసు వివరాలు వెల్లడించిన ఎస్‌పి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)


యాచక వత్తిని ప్రేరేపించి తద్వారా లబ్ధి పొందాలని ఆశపడి మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో శిశువును కిడ్నాప్ చేసినట్లు జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో శిశువు కిడ్నాప్‌కు గల కారణాలను వివరించారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామ శివారు సూరపనేనివారి పాలెంకు చెందిన రాచూరి స్వరూపరాణి ఈ నెల 8వ తేదీన ప్రసవం కోసం మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో చేరారు. 9వ తేదీ ఉదయం శస్త్రచికిత్స ద్వారా మగబిడ్డకు జన్మనిచ్చింది. తొమ్మిది రోజులు ఆసుపత్రిలో ఉండాలని వైద్యులు ఆమెకు సూచించారు. ఈ నెల 13 తేదీ రాత్రి తొమ్మిది గంటలకు భోజనం చేసిన తర్వాత రాచూరి స్వరూపరాణి, తల్లి గ్రేసమ్మ శిశువుతో పాటు వార్డులో, తండ్రి చిత్తూరి కోటేశ్వరరావు, భర్త రాచూరి సతీష్ రవికుమార్ ఆసుపత్రి కారిడార్‌లో నిద్రపోయారు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో గ్రేసమ్మ లేచిచూడగా శిశువు కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో వెంటనే మచిలీపట్నం పోలీసు వారికి సమాచారం అందించింది. బందర్ డిఎస్‌పి అబ్దుల్ సుభాన్ పర్యవేక్షణలో ప్రత్యేక బందాలను నియమించగా శిశువును కిడ్నాప్ చేసిన మచిలీపట్నం సర్కిల్‌పేటకు చెంది ప్రస్తుతం ఇంగ్లీష్‌పాలెంలో నివాసం ఉంటున్న తమ్మిశెట్టి లక్ష్మిని గంటల వ్యవధిలోనే పట్టుకున్నారు. నిందితురాలిని మచిలీపట్నం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్‌పి తెలిపారు. ఈ కేసులో కీలకపాత్ర పోషించిన బందర్ డిఎస్‌పి అబ్దుల్ సుభాన్‌ను, మచిలీపట్నం రూరల్ ఇన్స్పెక్టర్ సోమేశ్వరావు, బందర్ తాలూఖా పోలీసు స్టేషన్ ఎస్ఐ వీర ప్రసాద్, సిబ్బందిని ఎస్‌పి అభినందించి నగదు రివార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

జోరున వర్షం

- గన్నవరంలో విమానాల ల్యాండింగ్‌కు అంతరాయం
- వర్షంతో మెట్ల పైర్లకు జీవం



ప్రజాశక్తి-వత్సవాయి, గన్నవరం



అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజుల నుంచి కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. సోమవారం మధ్యాహ్నం 11 నుంచి సాయంత్రం వరకు జోరున వర్షం కురుస్తూనే ఉంది. వర్షం కారణంగా గన్నవరం విమానాశ్రయంలో విమానాల ల్యాండింగ్‌కు అంతరాయం ఏర్పడింది. ల్యాండింగ్‌కు ఎటిసి అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో హైదరాబాద్ నుంచి గన్నవరం వచ్చిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం కొద్దిసేపు గాల్లో చక్కర్లు కొట్టింది. వర్షాల కారణంగా విజయవాడలో ఎక్కడికక్కడ నీరు నిలచిపోయింది. బెంజ్‌సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, కబేళా, లోబ్రిడ్జి, రైల్వేస్టేషన్, పీఎన్‌బీఎస్, విద్యాధరపురం, సితార సెంటర్, వాగు సెంటర్ తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. జాతీయ రహదారిపై ఫుట్‌పాత్‌లకు పక్కన నిలిచిపోయిన నీటిని మున్సిపల్ సిబ్బంది హైడ్రాలిక్ యంత్రం ద్వారా తోడేశారు. రెండు రోజులుగా కురుస్తుండటంతో మెట్టపైర్లకు జీవం పోసినట్టైంది. పంటల్ని బతికించుకోవడం కోసం ఎదురుచూస్తున్న మెట్ట రైతులకు ఈ వర్షం ఊరట కల్పించింది. వత్సవాయి మండలంలో పత్తి, మొక్కజొన్న, పెసర రైతులు సాగు చేస్తున్నారు. లింగాల మునేరుకు నీరు చేరడంతో రైతులు వ్యవసాయ పనులు ముమ్మరం చేశారు. అక్కడక్కడ వరి విత్తనాలను మొక్క కట్టి నారుమడులు పోశారు.

‘అల్ట్రాటెక్’ ఘటనలో మరో కార్మికుడు మృతి



... వార్త ప్రధాన సంచికలో



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ సృజన

ప్రతిరోజు గ్రీవెన్స్‌తో అర్జీలకు పరిష్కారం

- ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ సృజన

వార్త 2లో

ఎస్‌పి కార్యాలయంలో గ్రీవెన్స్

ప్రజాశక్తి-విజయవాడ: బాధిత ప్రజల నుంచి స్వీకరించిన అర్జీల పరిష్కారానికి ఆయా పోలీస్టేషన్ల ఎస్‌హెచ్‌ఒలు పరిశీలించి, చర్యలు తీసుకోవాలని ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్‌వి రాజశేఖర్‌బాబు ఆదేశించారు.



పోలీసు కమిషనర్ వారి కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం సోమవారం జరిగింది. "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం) కార్యక్రమాన్ని నిర్వహించిన పోలీసు కమిషనర్ బాధితులు నుండి వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 68 ఫిర్యాదులపై భాదితులతో మాట్లాడటంతో పాటుగా, దివ్యాంగులు, వృద్ధుల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. పిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని ఫోన్ ద్వారా సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఒలతో మాట్లాడి సత్వరమే చర్యలు తీసుకోవాలని పోలీసు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

విజయవంతంగా జలశక్తి అభియాన్ : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ: నీటి సంరక్షణ, నీటి పారుదల సామర్థ్యాని ప్రోత్సహించే లక్ష్యంతో జిల్లాలో చేపడుతున్న జలశక్తి అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్, జిల్లా కార్యక్రమ సమన్వయ అధికారి జి. సృజన అన్నారు. నగరంలోని కలెక్టరేట్ క్యాంప్ కార్యాలయంలో సోమవారం జలశక్తి అభియాన్ కార్యక్రమం ద్వారా జిల్లాలో చేపట్టి పూర్తి అయిన, చేపడుతున్న పనుల ప్రగతిని డిపార్ట్మెంట్ ఆఫ్ టెలి కమ్యూనికేషన్స్ డైరెక్టర్, జలశక్తి అభియాన్ సెంట్రల్ నోడల్ అధికారి బి. మాధవరావు, 'సి' ఎస్‌ఆర్ శాస్త్రవేత రేస్మా ఎస్ రామన్ పిళ్లైకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నీటి బొట్టుని ఒడిసిపట్టే కేంద్ర ప్రభుత్వ నీటి సంరక్షణ నీటి పారుదల సామర్థ్యాన్ని పెంచే జలశక్తి అభియాన్ ద్వారా ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టి అమలు చేస్తున్నామన్నారు. జిల్లాలో జలశక్తి అభియాన్ కార్యక్రమాన్ని రెండు దశలలో చేపట్టడం జరిగిందన్నారు. 2019 జూలై నుండి అక్టోబర్ వరకు, రెండవ దశలో నవంబర్ నుండి డిసెంబర్ వరకు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో యంజిఎన్ఆర్ఇజిఎస్, జల వనరులు, అటవీ, వ్యవసాయ, ఉద్యాన, ఆర్‌డబ్ల్యుఎస్, గ్రౌండ్ వాటర్ తదితర శాఖల సమన్వయంతో జల సంరక్షణ, వర్షపు నీటి పెంపుదలకు ఫార్మపాండ్ చెక్‌డ్యాం పనులలో భాగంగా చిన్న సన్న కారు రైతుల పొలంలో పంట కుంటలు, ఊట కుంటల తవ్వకం, నదీ పరీవాహక ప్రాంతాలలో చెక్‌డ్యాం నిర్మాణం, రూఫ్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్, సాంప్రదాయ నీటి వనరులు /చెరువుల పునరుద్ధరణలో చెరువులు పూడిక తీయడం, గట్లపై మొక్కల పెంపకం, కాలువల పూడిక తీయడం, బోర్‌వెల్ రిఛార్జ్ నిర్మాణాలు, వాటర్ షెడ్ల అభివృద్ధి సమగ్ర అటవీకరణలో పనులు చేపట్టి పూర్తి చేయడం జరిగిందన్నారు. చెరువులలో పూడిక తీత, గట్ల వెంబడి మొక్కలు నాటడం, ఆహ్లాదకర వాతావరణం కల్పించడం వంటి లక్ష్యంతో చేపట్టిన అమృత్ సరోవర్ కార్యక్రమంలో 75 చెరువుల లక్ష్యానికి మించి 77 చెరువులలో విజయవంతంగా పూర్తి చేశామన్నారు.

ప్రతిరోజు గ్రీవెన్స్‌తో అర్జీలకు పరిష్కారం

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ సృజన

ప్రజాశక్తి-విజయవాడ: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారానే కాకుండా జిల్లా, మండల స్థాయిలో ప్రతిరోజు గ్రీవెన్స్ ద్వారా ప్రజా సమస్యల అర్జీలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి.సృజన అన్నారు. నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్ నుండి సోమవారం జిల్లా, మండల స్థాయి అధికారులతో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్, శానిటేషన్, తాగునీరు, సీజనల్ వ్యాధులపై జిల్లా కలెక్టర్ సృజన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముందస్తు అనుమతి లేకుండా జిల్లా స్థాయి అధికారులు, ఎంపిడివోలు, తహాశీల్దార్లు ప్రధాన కార్యాలయం విడచి వెళ్లరాదన్నారు. సెలవు రోజుల్లో కూడా తప్పనిసరి ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్ ద్వారా ప్రజల నుండి స్వీకరించే అర్జీలకు సరైన ఎండార్స్ మెంట్ ఉండాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున కాల్వ గట్ల పటిష్టతను ఎప్పటికప్పుడు పరిశీలించాలని వాగులు పొంగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలలో సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని నీరు నిల్వ ఉండకుండా చూడాలని, దోమలు ప్రబల కుండా ఎప్పటికప్పుడు బ్లీచింగ్ చల్లడం వంటి పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించేలా పంచాయితీరాజ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సృజన

95 అర్జీలు స్వీకరణ

ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించబోమని బాధ్యతతో విధులు నిర్వర్తించి ఉన్నతాధికారులు ప్రజలకు జవాబుదారులుగా వ్యవహరించినప్పుడే లక్ష్యాలు సాధించగలుగుతామని జిల్లా కలెక్టర్ డా.జి.సృజన అన్నారు. సోమవారం పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజల నుండి 95 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ విధులు నిర్వర్తించడంలోనూ ప్రజల సమస్యల పరిష్కారంలోను అలసత్వం ప్రదర్శించే అధికారులను ఉపేక్షించబోనన్నారు. విధి నిర్వహణలో అధికారుల పనితీరు ప్రభావం కింది స్థాయి సిబ్బందిపై కూడా పడుతుందన్నారు. ఎప్పటికప్పుడు తాను ప్రతి శాఖపై ప్రత్యేక దష్టి పెడతానని లక్ష్య సాధనలో జాప్యాన్ని గుర్తిస్తే చర్యలు తీసుకోవడానికి వెనుకాడనన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వివెంసి గ్రీవెన్స్‌లో 19 అర్జీలు

ప్రజాశక్తి-విజయవాడ: ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి ఫిర్యాదును పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి కమిషనర్, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డాక్టర్ ఎ మహేష్ ఆదేశించారు. విఎంసిలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో సోమవారం ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ ఎ.మహేష్ 19 అర్జీలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన అర్జీల పరిష్కారానికి శాశ్వత పరిష్కారాన్ని అందించాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. మూడు సర్కిల్స్ పరిధిలో స్వీకరించిన అర్జీల పరిష్కారానికి జోనల్ కమిషనర్లు చొరవ చూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో పర్యటన

అండర్ గ్రౌండ్ డ్రైయినేజి వ్యవస్థ మెరుగుదలకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి కమిషనర్, విఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ ఎ.మహేష్ అన్నారు. సోమవారం ఇన్‌ఛార్జి కమిషనర్ తన పర్యటనలో భాగంగా రాజ్ భవన్ ప్రాంతం, విజయ టాకీస్, ఏలూరు రోడ్డు, 27వ డివిజన్, 28వ డివిజన్ బిఆర్టిఎస్ భాను నగర్, 29వ డివిజన్ పప్పుల మిల్ సెంటర్, 49వ డివిజన్ ఫైజర్ పేట పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా రాజభవన్ ప్రాంతంలో గల రోడ్డుపైనున్న మాన్ హోల్, రోడ్డు లెవెల్



కంటే తక్కువగా ఉండటం వలన వర్షపు నీటి నిలువలు యుజిడి మాన్హోల్ పైన నిలిచి ఉండటం గమనించి, దాని రోడ్ లెవెల్ కి పెంచి సమస్యను పరిష్కరించవలసిందిగా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అంతేకాకుండా అన్ని సర్కిల్లోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు వాళ్ళ పరిధిలో ఉన్న ఇటువంటి సమస్యలను వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. విజయ టాకీస్ సిగ్నల్ పాయింట్ వద్దా పొంగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మురుగును గమనించి వెంటనే దీని పరిష్కరించాలని, వాటర్ పైప్లైన్ లిక్ లు ఎక్కడున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-2 ఏలూరు రోడ్డు మొత్తం పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చారు. 27, 28, 29 డివిజన్లో పర్యటించి పారిశుద్ధ నిర్వహణ 49వ డివిజన్, ప్రెజర్ పేట పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణ ని పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

నేడు కేన్సర్‌పై అవగాహనా సదస్సు

విజయవాడ: మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ మంగళవారం ఉదయం 12 గంటలకు బాలోత్సవ భవన్ రెండో అంతస్తులో కేన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎంబివికె బాధ్యులు కె.స్వరూపరాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు మణిపాల్ ఆసుపత్రి కేన్సర్ శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ జి.కృష్ణారెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. కేన్సర్‌పై అవగాహన లేక అనేక మంది చివరిదశకు వచ్చిన తరువాత చికిత్స లేక ఇబ్బందులు పాలవుతున్న పరిస్థితుల్లో ప్రతిఒక్కరికి అవగాహన పెంచుకోవడానికి ఈ సదస్సు ఉపయోగపడుతుందని, ఈ సదస్సుకు ప్రతిఒక్కరూ హాజరై కేన్సర్‌పై అవగాహన పెంచుకోవాలని కోరారు.

జక్కంపూడిలో ట్యాంకర్లతో నీరు సరఫరా

ప్రజాశక్తి-విజయవాడ: జక్కంపూడి వాసులకు రెండు రోజుల వరకు మంచినీటి సరఫరా ఉండదని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా ట్యాంకర్లతో నీటి సరఫరా చేయడం జరుగుతుందని ఇన్‌చార్జి కమిషనర్, విఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ ఎ మహేష్ అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ... కెఎల్ రావు హెడ్ వాటర్ వర్క్స్ నుండి జక్కంపూడి వెళ్లే నీటి సరఫరా పైప్‌లైన్లు మరమ్మతులు ఉండటం వల్ల జక్కంపూడి వాసులకు రెండు రోజుల వరకు మంచినీటి సరఫరా ఉండదని తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

చితికిన బతుకులు

మృతిచెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. గత కొద్దిరోజులుగా నిరంతరంగా వర్షాలు పడుతుండటంతో పాటు ముందుగానే బ్లాస్టింగ్ జరగడం ద్వారా కదిలిపోయిన కొండరాళ్ల బ్లాక్స్‌కు హోల్స్ వేస్తున్నందున ఒక్కసారే బండరాళ్లన్నీ జారి కింద పడటంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పొట్ట కూటి కోసం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి కూలి నాలి చేసుకునే కార్మికులు క్వారీలో దుర్మరణం చెందడంతో కార్మికుల కుటుంబాల్లో విషాదం నెలకొంది. క్వారీలలో బ్లాస్టింగ్ చేసే కార్మికులకు, బ్లాస్టింగ్ కోసం హోల్స్ వేసే కార్మికులకు సరైన రక్షణ సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడం వల్లే నిత్యం క్వారీలలో ఇటువంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపణలు ఉన్నాయి.

కంచికచర్ల మండలం పరిటాల గ్రామ పరిధిలో కొండపల్లి రిజర్వ్ ఫారెస్ట్ అంచున దాదాపు 60 దాకా క్వారీలు, 30 వరకు క్రషర్లు ఉన్నాయి. గత కొన్ని దశాబ్దాలుగా ఇక్కడ క్వారీలను ప్రభుత్వం నుండి లీజుకు తీసుకొని రాళ్లను పగలగొట్టి క్రషర్స్ ద్వారా అవసరమైన మేర మెటల్‌ను సరఫరా చేస్తుంటారు. 1990కి పూర్వం శ్రీకాకుళం, తమిళనాడు, ఒడిస్సా ప్రాంతాల నుండి క్వారీ క్రషర్ యజమానులు కూలీలను తీసుకువచ్చి ఇక్కడ కొండలపై మాన్యువల్ పద్ధతిలో పని చేయించే వారు. ఇక్కడ సుమారు ఐదు వేల మందికి పైగా కార్మికులతో ఒక గ్రామమే ఏర్పడింది. అప్పట్లో కూడా కార్మికులకు గాయాలు తగలడం, మరణించడం జరిగిన సంఘటనలో నామమాత్రపు నష్టపరిహారం చెల్లించి క్వారీల యజమానులు చేతులు దులుపుకునేవారు. 2004 కార్మికుల పక్షాన మానవ హక్కుల సంఘాల నేతలు సుప్రీంకోర్టులో కార్మికుల హక్కుల కోసం పోరాడారు. అంతేగాక ఆధునిక టెక్నాలజీ రావడంతో యజమానులు మ్యానువల్ పద్ధతిని మానివేసి కొండలలో 300 మీటర్ల వరకు గోతులు తవ్వి దాంట్లోకి మందుకూర్చి పేల్చేవారు. దీని వల్ల కొండలు దద్దరిల్లిపోయి చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లో ఇళ్లు సైతం నెర్రలిచ్చుడమే కాకుండా తలుపులు, కిటికీలు సైతం పగిలిపోయిన సంఘటనలు ఉన్నాయి. క్వారీలు పక్కన ఉన్న రైతులతో పేచి రాకుండా క్రషర్ యజమానులు వారి పొలాలను కౌలుకు తీసుకుని అభ్యంతరాలు లేకుండా చూసుకున్నారు. సుప్రీం కోర్టు స్పందనతో అప్పట్లో కృష్ణాజిల్లా కలెక్టర్, మైనింగ్, కార్మిక శాఖ ఆధ్వర్యంలో అక్రమ తవ్వకాలను ఆపివేయించారు. ఈ ప్రాంత క్వారీ క్రషర్ యజమానులు ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ నాయకులకు నెలవారీ నజరానాలు సమర్పించుకొని ప్రభుత్వం నుండి అభ్యంతరాలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. సుప్రీంకోర్టు 30 అడుగుల మించి కొండలలో రాయి పేల్చేందుకు గోతులు తవ్వరాదని నిబంధన విధించినప్పటికీ కొందరు క్వారీ యజమానులు 200 నుండి 300 అడుగుల లోతు గోతులు తవ్వి మందులు పెట్టి కొండలను పేలుస్తున్నారు. ఇప్పటికీ అదే విధానం కొనసాగిస్తున్నారు. అయినప్పటికీ గనుల శాఖ అధికారులు మామూళ్ల మత్తులో పడి పట్టించుకోలేదు. దీనివల్ల కేతన కొండ దగ్గర నుండి గొట్టుముక్కల వరకు పక్కా గృహాలు సైతం ఈ పేలుళ్ల వల్ల నెర్రలిస్తున్నాయి. సామాన్యుల ఫిర్యాదును ప్రభుత్వ అధికారులు పట్టించుకోకపోవడంతో క్వారీ, క్రషర్స్ యజమానులు భూమి లోపల రెండు వందల అడుగులకు పైగా లోతు తవ్వి రాయి నిల్వలను బయటకు తీసుకున్నారు నిబంధన ప్రకారం భూమి లోపల రాళ్లు తవ్విన పెద్ద గోతులను క్రషర్స్ నుండి వచ్చే డస్టుతో పూడ్చాల్సి ఉన్నప్పటికీ దానిని సైతం అమ్ముకోవటానికి క్రషర్ యజమానులు అలవాటుపడ్డారు. చెరువుల్లాంటి ఈ గోతులను పూడ్చకపోవడంతో ఈ గోతులలో నీళ్లు చేరి ఎందరో కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఇటీవల కాలంలోనే సుమారుగా పది మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. దీనిపై ప్రభుత్వం స్పందించి క్రషర్స్, క్వారీలపై సమగ్ర విచారణ చేపడితే ఎన్నో వైఫల్యాలు బయటపడతాయని ప్రజలు అంటున్నారు.

అర్జీదారులకు పరిష్కారం అందించడమే లక్ష్యం : జెసి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : వివిధ సమస్యల పరిష్కారం కోసం అర్జీదారులు విన్నవించిన సమస్యలకు సకాలంలో నాణ్యమైన పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం జాయింట్ కలెక్టర్ కలెక్టరేట్ లోని సమావేశపు మందిరంలో డిఆర్ఓ కె చంద్రశేఖర రావు, బందరు ఆర్డిఓ ఎం వాణిలతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'మీ కోసం' కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, నిర్ణీత సమయానికి పరిష్కారం చూపాలన్నారు. నిర్లక్ష్యంతో అర్జీలను పెండింగ్లో ఉంచరాదని అధికారులకు సూచించారు. జెడ్పిసిఈఓ ఆనంద్ కుమార్, డ్వామా పిడి జీవీ సూర్య నారాయణ, డిపిఓ/డిఆర్డిఎ పిడి నాగేశ్వర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, డిఐసి జిఎం వెంకటరావు, జిల్లా ఉద్యాన అధికారిణి జే. జ్యోతి, జిల్లా విద్యాశాఖ అధికారిణి తాహెర సుల్తాన, డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ జి గీతాబాయి పాల్గొన్నారు.



సమస్యలు వింటున్న అధికారులు

సంక్షేమబోర్డు కొనసాగించాలని వినతి

గత వైకాపా ప్రభుత్వం తెచ్చిన 1214 మెమోను రద్దు చేయాలని, సంక్షేమబోర్డు కొన సాగించాలని, స్క్రూట్నీ కమిటీ ఆమోదము జరిగి, నిలుపుదల చేసిన క్లైయిమ్లు, పెండింగ్ క్లైయిమ్లు, పెండింగ్ కార్డులు ఇవ్వాలని కోరుతూ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) కష్ణాజిల్లా కమిటీ ఆద్వర్యంలో సామూహిక రాయభారం కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలక్టరేట్లో నిర్వహించిన మీ కోసం అర్జీ అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు సుధీర్ఘ పోరాటాలు చేసి సాధించుకున్న సంక్షేమ బోర్డును ఏర్పాటు చేశారని, అయితే గత ప్రభుత్వం జిఒఓ నెంబర్ 1214 తెచ్చి నిర్మాణ కార్మికులకు ఇచ్చే బెనిఫిట్స్ నిలుపుదల చేశారన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు కొనసాగిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టులో వాగ్దానం చేసిన తెలుగుదేశం, జనసేన పార్టీలు సంక్షేమ బోర్డుని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బిల్డింగ్ వర్కర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.గోపాల రావు,కె. రవి, సిఐటియు మండల కార్యదర్శి సి హెచ్.జయరావులు ఉన్నారు.



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న అరుణసారిక

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ద్విచక్ర ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక సూచించారు. జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో హెల్మెట్ ధరించడంపై సోమవారం జిల్లా కోర్టు ప్రాంగణం నుండి జిల్లా కోర్ట్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని జండా ఊపి ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ గౌరవ హైకోర్టు ఉత్తర్వులు అనుసరించి ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించి ప్రమాదాల బారిన పడకుండా ఉండాలన్నారు.ఒకవేళ ప్రమాదం జరిగిన తలకు గాయం కాకుండా ప్రాణాలు కాపాడుకోగ ´లుగుతారని సూచించారు. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతూ ప్రాణాలు పోగొట్టు కుంటున్నారని కాబట్టి ప్రతి వాహన దారుడు హెల్మెట్ ధరించి పోలీస్ శాఖకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ఎం. రామకష్ణయ్య, పలువురు న్యాయ మూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి : ఎస్పి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న పోలీస్ సిబ్బంది విధి నిర్వహణలో గాని, అనారోగ్య సమస్యలతో గాని ఇబ్బంది పడకూడదని వారి సమస్యలను ధైర్యంగా చెప్పుకుని పరిష్కారం పొందాలని జిల్లా యస్పీ అద్నాన్ నయీమ్ అస్మి అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సిబ్బందితో నేరుగా ముఖాముఖి సంభాషించి, వారి సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది ఎవరైనా ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్న ధైర్యంగా వెంటనే తన దష్టికి తీసుకు రావాలని సూచించారు. తద్వారా సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్పి నయీమ్ అస్మి

ఉద్యోగుల సమస్యలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్


ఉద్యోగుల సమస్యలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఉద్యోగుల గ్రీవెన్స్ డే నిర్వహించి వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల నుండి అర్జీలు స్వీకరించారు. ఉద్యోగుల సమస్యలను జిల్లా కలెక్టర్ ఎంతో ఓపికగా విని సంబంధిత అధికారులను పిలిపించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మాదకద్రవ్యాలతో జీవితం నాశనం : కలెక్టర్



ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : మాదక ద్రవ్యాలు మానవ శరీరానికి మిక్కిలి హాని కలిగించే పదార్థాలని, వీటి వాడకం వలన చిన్న వయసులోనే జీవితాన్ని కోల్పోతారని జిల్లా కలెక్టర్ డికె. బాలాజీ అన్నారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమంపై మహిళా అభివద్ధి శిశు సంక్షేమ శాఖ రూపొందించిన కరపత్రాలను సోమవారం జిల్లా కలెక్టర్ కలక్టరేట్ సమావేశ హాలులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలక్టర్ మాట్లాడుతూ బుర్రకథ కళాకారుల ద్వారా మాదకద్రవ్యాల వినియోగం నివారణకు విస్తతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె చంద్రశేఖరరావు, డిఇఓ తహేర సుల్తానా, ఐసిడిఎస్ పిడి సువర్ణ, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి, జడ్పీ సీఈవో ఆనంద్ కుమార్, సిపిఓ గణేషు, డిపిఓ నాగేశ్వరరావు నాయక్ పాల్గొన్నారు.

వర్షంతో రహదారులు జలమయం




గుడ్లవల్లేరు మండలంలోని ఓ కాలనీలో నిలిచిన నీళ్లు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు జలమయమయ్యాయి. మండల కేంద్రమైన గుడ్లవల్లేరు జగనన్న కాలనీ, 1వ వార్డు, ఎన్టీఆర్ కాలనీ, నెహ్రూ నగర్, ఇందిరా కాలనీ,కవుతరం ఒకటవ వార్డ్ లోని రోడ్లు పై నీరు నిలచిపోయి చెరువులు లాగా మారాయి. సోమవారం ఉదయం నుండి సాయంత్రం వరకు ఎడతెరుపు లేకుండా వర్షం కురుస్తూనే ఉండటంతో విద్యార్థులు, ఉద్యోగులు, వ్యవసాయ కూలీలు వారి పనులకు అంతరాయం ఏర్పడి తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. జగనన్న కాలనీలో వందల కుటుంబాలు నివాసం ఉంటున్నారు. ఆ కాలనీకి రోడ్ల నిర్మాణం లేకపోవడంతో ఇంటి నుండి బయటకు రావడానికి బురద రహదారిలో అగచాట్లు పడ్డారు.

చెరువులా రహదారి : వాహనదారుల ఇబ్బందులు

ప్రజాశక్తి-గన్నవరం : సోమవారం కురిసిన భారీ వర్షానికి రామవరప్పాడు వద్ద రహదారి చెరువుల మారిపోయింది. రహదారి ప్రక్కనే డ్రైనేజీ ఊడిపోవడంతో వర్షం నీరంతా రోడ్డుపైనే ఆగిపోయింది. వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రహదారి పక్కనే ఉన్న డ్రైనేజీ తూములు ఊడిపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని, తూములు బాగు చేయించి పని చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



రామవరప్పాడులో రహదారిపై నిలిచిన నీరు

పెట్రోల్ బంక్ సిజ్

ప్రజాశక్తి-గుడివాడరూరల్: గుడివాడ మండలం మల్లాయపాలెం పంచాయతీ బంటుమిల్లి రోడ్డులో కల్తీ పెట్రోల్ అమ్మకాలు చేస్తున్న బంకును ఆదివారం అధికారులు సీజ్ చేశారు. నిబంధనలకు పాతర వేసి అడ్డగోలుగా కల్తీ పెట్రోల్ అమ్ముతున్నట్లు పౌరసరఫరాల శాఖ, తూనికల కొలతల శాఖ అధికారులు తనిఖీల్లో గుర్తించారు. ష గులాబ్ చంద్ జీవత్ అండ్ కో వారి హెచ్పిసిఎల్ పెట్రోల్ బంకులు సగం నీటితో పెట్రోల్ పోస్తున్నారని వినియోగదారులు ఆదివారం ఆందోళన చేశారు. పౌరసరఫరాల శాఖ తూనికల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. బంకులోని ట్యాంకుల్లో నీటితో కూడిన ఇంధనాలు నిల్వలు పెట్రోల్ పూర్తిగా నాణ్యత ప్రమాణాల్లో లోపించాయని నిల్వలు, విక్రయాలకు పొంతన లేకుండా ఉండటం గుర్తించారు. వెంటనే పెట్రోల్ బంకును అధికారులు సీజ్ చేశారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



ప్రజాశక్తి-గూడూరు : రైతులు కొనుగోలు చేసిన ప్రతి దానికి డీలర్స్ తప్పనిసరిగా బిల్లు లు ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి జి శివ ప్రసాద్ అన్నారు.గూడూరు మండలం రాయవరం గ్రామంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలలో సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేసారు. ముఖ్యంగా జి ఎస్ టి లో వున్న డోర్ నెంబర్ లైసెన్స్ లో వున్న నెంబర్ ఒకేలా ఉండాలని, తప్పనిసరిగా డిస్ప్లే బోర్డు లో ఎరువులు వాటి స్టాక్ పోసిషన్ ప్రతి రోజూ వేయాలని తెలిపారు.రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఆదేశాల అనుసరించి జిల్లా కార్యాలయంలో అంతర్గత తనిఖీ బందం ఏర్పాటు చేసారన్నారు.ఎరువులు పురుగుమందుల దుకాణాలు వ్యవసాయ శాఖ నియమ నిబంధనలకు అనుగుణంగా నాణ్యమైన ఎరువులు పురుగుమందులు మాత్రమే రైతులకు విక్రయించేలా చర్యలు చేపట్టారనీ ఎరువులు ఈపాస్ ద్వారానే విక్రాయించాలని ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమం లో రాయవరం వి ఏ ఏ ప్రియదర్శిని పాల్గొన్నారు.



వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎంఎల్ఎ కృష్ణప్రసాద్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-గూడూరు : గూడూరు మండలంలోని గూడూరు, మల్లవోలు గ్రామాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మరియు కప్పలదొడ్డి, రామరాజుపాలెం సచివాలయాలతో పాటు గూడూరు పంచాయతీ కార్యాలయాన్ని పెడన నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కాగిత కృష్ణ ప్రసాద్ ఆస్పత్రిలోని కొన్ని వైద్య సేవా విభాగాలు ను పరిశీలించారు.అలాగే రోగులకు ఇచ్చే మందులు సరిపడా రావడం లేదని గుర్తించి అవసరం అయిన మందులు,సెలైన్లు గురించి సంబంధించిన అధికారులు కు రిపోర్ట్ చేయాలనీ తెలిపారు. కష్ణ ప్రసాద్ వైద్య సిబ్బంది తో మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, చికిత్స కు అవసరమైన వైద్య సేవలు అందించేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పోతన స్వామి, గోపి నాగబాబు, అన్నం హరి రామకష్ణ, ఎస్ ఏ బేగ్,పోతన రామోజీ,బాసం శెట్టి శ్రీను, కట్ట మునేశ్వరరావు పాల్గొన్నారు.



డివిజన్‌లో పర్యటిస్తున్న సత్యబాబు

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి : సత్యబాబు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గం 50వ డివిజన్‌లోని గొల్లపాలెం గట్టు కొండ ప్రాంతంలో పారిశుధ్యం వల్ల దోమల వ్యాప్తి ఎక్కువైందని, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని స్థానిక కార్పొరేటర్ బోయి సత్యబాబు విఎంసి అధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం బోయి సత్యబాబు డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాల వల్ల పారిశుధ్యం, దోమలు విజృంభించే పరిస్థితులు ఉన్నందున నివారణ చర్యలు వేగవంతంగా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కాలు స్థలాలు వథాగా పడి ఉన్న వివిధ వస్తువుల్లో నీరు నిల్వ వల్ల దోమల వృద్ధి చెంది మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. జ్వరాలు ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. ఖాళీగా ఉన్న పాత ఇళ్లలు, గోతులు వంటి ప్రాంతాలను అధికారులు పరిశీలించి లార్వా నివారణ దశలో అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. పారిశుధ్యం దోమల నివారణకు తగిన సిబ్బందిని నియమించి వేగవంతంగా చర్యలు చేపట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. ఈ నెల 10న జరిగిన కౌన్సిల్లో ఈ అంశంపై ప్రతిపాదన చేయగా కౌన్సిల్ ఆమోదించిందని తెలిపారు. మలేరియా విభాగం ఇన్స్పెక్టర్ ఎస్.కె రాంబాబుకు ఈ విషయమై ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు.. ఈ పర్యటనలో డివిజన్ శానీటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వారాహి నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దేవస్థానంలో ఈ నెల 6వ తేదీ నుండి 15వ తేదీ వరకు జరుగుచున్న వారాహి నవరాత్రి ఉత్సవాలు సోమవారం పూర్ణాహుతితో ముగిశాయి. సోమవారం ఉదయం 10 గంటలకు రుద్ర హోమం జరుగు యాగశాలలో ఆలయ కార్యనిర్వాహణాధికారి సమక్షంలో స్థానాచార్యులు మరియు వైదిక సిబ్బందిచే వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ 'పూర్ణహుతి' కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు విష్ణుభట్ల శివప్రసాద శర్మ, సహాయ కార్యనిర్వాహనాధికారి ఎన్. రమేష్, వైదిక కమిటీ సభ్యులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మకు సారె

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి ఆషాడ మాసం సందర్భంగా దేవస్థానంలో శ్రీ అమ్మవారికి పవిత్ర సారె సమర్పించే కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ కేశఖండన శాల విభాగం వారు కుటుంబ సభ్యులతో కలిసి దుర్గమ్మకు ఆషాడ సారె సమర్పించారు. ఊరేగింపుగా ఆలయానికి చేరుకోగా ఇఒ కె.ఎస్.రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనం చేసుకొని, ఈవో చేతుల మీదుగా అమ్మవారికి సారె సమర్పించారు. మహామండపం ఆరవ అంతస్తులో ఉత్సవ విగ్రహం వద్ద ఆలయ అర్చకులు ఆశీర్వాదం అందజేశారు. సహాయ కార్యనిర్వాహణాధికారులు, అధికారులు, కేశఖండన సిబ్బంది, ఇతరులు పాల్గొన్నారు.



19, 20 తేదీలలో బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్‌చే ప్రవచనాలు

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 19, 20వ తేదీలలో సాయంత్రం 6 గంటల నుండి 8 గంటల వరకు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్‌చే 'శ్రీ కనకదుర్గా దేవి మహిమలు' ఆధ్యాత్మిక, ధార్మిక ప్రవచనం ఏర్పాటు చేయనున్నట్లు దుర్గగుడి కార్యనిర్వహణాధికారి కె.ఎస్.రామారావు తెలిపారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్, అన్ని విభాగాల అధికారులతో సోమవారం ఆలయ ఇఒ సమావేశమై చేయవలసిన ఏర్పాట్లు సదుపాయాల గురించి చర్చించారు.

జ్వరాల నివారణకు పటిష్ట చర్యలు : జిల్లా వైద్యాధికారి

ప్రజాశక్తి - ఏ.కొండూరు : ఏ కొండూరుతో పాటు మండలంలోని గోపాలపురం మాధవరం పాత కొండూరు గ్రామాల్లో జ్వరాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వైద్య అధికారి ఎం.సుహాసిని అన్నారు. సోమవారం ఆమె మండలంలోని జ్వర పీడిత గ్రామాలైన ఎ.కొండూరు ఎస్సీ కాలనీ పాత కొండూరు మాధవరం గ్రామాల్లో వైద్య సిబ్బందితో పర్యటించి జ్వర పీడితులను పరామర్శించారు. ఆమె మాట్లాడుతూ జ్వరల నివారణకు ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను కూడా పాటించాలని అలానే నివాసాల పరిసరాలలో మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా దోమలు గృహాలలోని కూలర్లలోను ఫ్రిజ్‌లోను డెంగ్యూ దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని అందువల్ల ఎక్కడా నీటిని నిల్వ ఉండకుండా చూసుకోవాలని ఆమె సూచించారు.



ఎ.కొండూరులో ఎస్సీ కాలనీలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఈ ప్రాంతంలో జ్వరాలు పూర్తిగా తగ్గేవరకు వైద్య శిబిరం కొనసాగుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డా. మధుబాబు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డా కే. శ్రీనివాస్ గంపలగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డా.శృతి, డాక్టర్ స్వాతి సూపర్ వైజార్ మురళీ వివిధ గ్రామాల ఏ ఎన్ ఎం లు ఆసుపత్రి సిబ్బంది ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



రహదారిపై గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - మైలవరం : వెల్వడం నుండి నూజివీడు వరకు ఉన్న రహదారి గుంతల మయంగా ఉండటంతో ప్రయాణికులు, వాహన శోధకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గుంతల మయంగా రహదారి శీర్షికతో ప్రజాశక్తిలో ఈ నెల 14న వార్త ప్రచురితమైంది. స్పందించిన స్థానిక ఎంఎల్‌ఎ వసంత కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు సోమవారం కోడూరు మనోజ్ కుమార్ (కన్నా) ఆధ్వర్యంలో సోమవారం వెల్వడం అయ్యప్ప స్వామి గుడి వద్ద నుండి గణపవరం అడ్డ రోడ్డు వరకు రహదారిపై ఏర్పడిన గుంతలలో కంకర, సిమెంటు, ఇసుక కలిపి పూడ్చారు. ఈ సందర్భంగా మనోజ్ కుమార్ మాట్లాడుతూ ఎంఎల్‌ఎ ఆదేశాల మేరకు రహదారులపై ఏర్పడిన గుంతలను మరమ్మత్తులు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వెల్వడం గ్రామ టిడిపి అధ్యక్షులు పత్తిపాటి ప్రభాకర్, సెక్రటరీ రాంప్రసాద్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతి దొండపాటి విజయ్, పాల్గొన్నారు.

ఆస్ట్రో ఫిజిక్స్‌పై వర్క్‌షాప్

ప్రజాశక్తి - భవానీపురం : డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, ఆకర్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం విద్యాధరపురం, అరవింద వీధిలో గల బెజవాడ రాజారావు స్కూల్‌లో సైన్స్ అండ్ టెక్నాలజీపై కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఆకర్ష ఫౌండేషన్ ప్రెసిడెంట్ గర్రె శంకరరావు, ఫైథాలజిస్ట్ డిక్టర్ సాయి సతీష్, సైకాలజిస్ట్ గాయత్రీ, ట్రైనర్ వంశీ, పాఠ శాల ప్రిన్సిపల్స్ బెజవాడ రాజారావు పాల్గొన్నారు. ఆర్టిఫి షియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, హెల్త్ హైజిన్, ఆస్ట్రో ఫిజిక్స్ మీద వర్క్ షాప్ నిర్వహించారు. బిగ్ బ్యాంగ్ థియరీ గురించి వివరించారు. టెక్నాలజీ మీద లఘు చిత్రా లను ప్రదర్శించారు. ఐఓటి సెన్సార్లను ప్రదర్శించారు దీనికి డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ వారు స్పాన్సర్ చేశారు.

గ్రామాల్లో పర్యటన

ప్రజాశక్తి - గంపలగూడెం: వర్షాకాల పరిస్థితుల్లో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడి ఇబ్బందులు పడుతుంటారని ఆ మేరకు గ్రామాల్లో పర్యటించి తగు చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఎ శ్రీనివాస్ తెలిపినట్లు ఎంపిడిఒలు, ఆరోగ్య సిబ్బంది తెలిపారు. ఈ మేరు వారు గ్రామాల్లో పరిశీలించారు. ఎంఎల్ఎ శ్రీనివాస్ ఇటీవల సింగపూర్ పర్యటనలో ఉండి ఫోన్ ద్వారా ఆయన అధికారులకు సూచించినట్లు తెలిపారు.

డ్రైవింగ్ పట్ల నైపుణ్యత ఉండాలి

ప్రజాశక్తి - కంచికచర్ల : డ్రైవింగ్ శిక్షణ పొందుతున్న విద్యార్థులు డ్రైవింగ్ పట్ల పూర్తి అవగాహనను కలిగి ఉండాలని అప్పుడే సమర్ధవంతమైన డ్రైవింగ్ చెయ్యగలరని రవాణాశాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజుబాబు అన్నారు. కంచికచర్ల హైవే రోడ్డులో గల అన్నపూర్ణ హెవీ మోటర్ డ్రైవింగ్ స్కూల్‌లో సోమవారం హెవీ వాహనాలపై శిక్షణలు పొందుతున్న విద్యార్థులతో రోడ్ సేఫ్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎపి రవాణాశాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజుబాబు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు తగ్గించే దిశగా రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయని, అయినప్పటికీ రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గించలేకపోతున్నామన్నారు. శ్రీ అన్నపూర్ణ హెవీ మోటార్ డ్రైవింగ్ స్కూల్ వ్యవస్థాపకులు బి.నారాయణరావు మాట్లాడుతూ 2022లో హెవీ మోటార్ డ్రైవింగ్ స్కూల్‌ను ప్రారంభించామని, 50 జట్లకు ఇప్పటికే శిక్షణ ఇచ్చామని అన్నారు. డ్రైవింగ్ పట్ల పూర్తి అవగాహన కల్పించడమే ధ్యేయం అన్నారు. డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ సిహెచ్.రామారావు, డ్రైవింగ్ శిక్షకుడు ఎ.ప్రేమ్ చంద్, శిక్షణ పొందుతున్న డ్రైవర్లు, డ్రైవింగ్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌బిఆర్‌సిఇ కళాశాలకు ఎస్ఐఆర్ఓ గుర్తింపు

ప్రజాశక్తి - మైలవరం : లక్కిరెడ్డి బాలిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుపుతున్న స్థానిక లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలకు శాస్త్రీయ పారిశ్రామిక పరిశోధన విభాగం (డిఎస్ఐఆర్) సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం ద్వారా సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ హోదా పొందిందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గుర్తింపు 2027, 3వ నెల వరకు ఉంటుందన్నారు. ఈ గుర్తింపు వల్ల కస్టమ్స్ లేదా ఎక్సైజ్ సుంకం చెల్లించకుండా రీసెర్చ్‌అండ్ డెవలప్‌మెంట్ పరికరాలు, సాధనాలు, విడిభాగాలు, వినియోగ వస్తువులను దిగుమతి చేసుకోవచ్చని, వివిధ ప్రభుత్వ శాఖల ఏజెన్సీల నుండి ఆర్అండ్‌డి నిధులు పొందొచ్చని తెలిపారు. పారిశ్రామిక పరిశోధన, అభివృద్ధి యూనిట్లకు సాంకేతిక ఆర్థిక సహాయాన్ని కూడా అందిస్తారని, నూతన ఆవిష్కరణల సహకారం, సాంకేతిక బదిలీలు ప్రోత్సహించడానికి శిరోలు పరిశోధనా సంస్థలు, విశ్వవిద్యాలయాలు ఇతర సంస్థలతో కలిసి పని చేయవచ్చునని పేర్కొన్నారు. ఈ గుర్తింపు రావడానికి కషి చేసిన రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ డాక్టర్ ఎస్.పిచ్చిరెడ్డి, ఎస్ఐఆర్ఓ ఇన్చార్జి డాక్టర్ పి.సత్యనారాయణ బృందాన్ని కళాశాల హానరరీ చైర్మన్ లక్కిరెడ్డి జయప్రకాష్ రెడ్డి, చైర్మన్ లక్కిరెడ్డి ప్రసాద్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి లు అభినందించారు.



శస్త్ర అధ్వర్యంలో సెక్యూరిటీ సైంటిఫిక్ టెక్నికల్ సదస్సు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : సెక్యూరిటీ అండ్ సైంటిఫిక్ టెక్నికల్ రీసెర్చ్ అసోసియేషన్ (శస్త్ర) సంస్థ బెట్టింగ్‌పై ప్రత్యేకంగా నివేదికను రూపొందించినట్లు సంస్థ డైరెక్టర్ నితీశ్ తెలిపారు. ప్రముఖ టెక్–పాలసీ థింక్ ట్యాంక్ అయిన ఇండియా ఫ్యూచర్ ఫౌండేషన్‌తో పాటు కలిసి సర్వే నిర్వహించి నట్లు తెలిపారు. బెట్టింగ్‌ను అరికట్టడం, జాతీయ భద్రత ఆవశ్యకత' అనే పేరుతో ఒక సమగ్ర నివేదికను విడుదల చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం, ప్రభుత్వ రంగానికి చెందిన ప్రముఖులు, పరిశోధనా సంస్థలు, సలహా బృందాలు పాల్గొన్న ఇటీవల జరిగిన రౌండ్‌టేబుల్ చర్చలో ఈ నివేదిక సమర్పించినట్లు తెలిపారు. చారిత్రక నేపథ్యం, ప్రస్తుత చట్ట పరమైన ఫ్రేమ్‌వర్క్, ప్రభుత్వ చర్యలు, వాటి ప్రభావం, కేస్ స్టడీస్ ద్వారా మద్దతిచ్చే చట్టవిరుద్ధమైన బెట్టింగ్ కార్యకలా పాలలో పోకడలు, జాతీయ భద్రతాపరమైన సమస్యలు గురించి చర్చించినట్లు తెలిపారు.



వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న వైద్యాధికారి ఎం.సుహాసిని

వైద్య శిబిరం ఏర్పాటు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ఏ.కొండూరు : ఏ కొండూరు మండలంలో గోపాలపురం మాధవరం పాత కొండూరు ఎస్సీ కాలనీలో విష జ్వరాలపై ప్రజాశక్తిలో ప్రచురించిన వరుస కథనాలతో సోమవారం వైద్య అధికారులు కదిలి ఆయా గ్రామాల్లో పర్యటించారు. వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లా వైద్యాధికారి ఎం.సుహాసిని తన సిబ్బందితో పై గ్రామాల్లో పర్యటించి జ్వర పీడుతులను పరామర్శించి మాధవరానికి చెందిన జ్వరబాధితులు ముగ్గురిని 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఖాళీలను భర్తీ చేయాలి

ప్రజాశక్తి - గంపలగూడెం: పలుచోట్ల సంపూర్తి ఉపాధ్యాయ సిబ్బంది లేక ఇబ్బందులు ఎదురవుతున్నట్లు స్థానిక యుటిఎఫ్ మండల కార్యదర్శి జి.కోటేశ్వరరావు తెలిపారు. ఈ సర్దుబాటు జరగకపోవడంతో ఉపాధ్యాయులు కొన్నిచోట్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్టు వివరించారు. ఈ మేరకు సోమవారం స్థానిక విద్యాశాఖ అధికారి పివిడిఎల్ నరసింహారావుకు వినతి పత్రం అందజేశారు. ఇటీవల తమ కార్య వర్గ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పర్య టించిన పరిస్థితుల్లో ఈ విషయాలు వెల్లడై నట్లు వివరించారు. ఉదయం పాఠశాలల్లో ఫేస్ అటెం డెన్స్ సాంకేతిక లోపాలతో జరగడం లేదని, అటువంటి సమయాల్లో అధికారులు తమకు నోటీసులు జారీ చేస్తున్నట్లు చెప్పారు. సాంకేతిక లోపాలను సవరించాలని, లేదంటే నోటీసులు జారీ నిలిపివేయాలని ఆ వినతిలో కోరారు.



ఆయిల్ బాల్స్‌తో దోమలకు చెక్

ప్రజాశక్తి - గంపలగూడెం : వర్షాకాల పరిస్థితుల్లో ప్రజలు దోమల బారిన పడి ఇబ్బందులు పడకుండా నివారణ చర్యలు తీసుకుంటున్నట్లు స్థానిక టౌన్ పంచాయతీ ఇఒ జి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. గ్రామాల్లో కూడళ్ళలో పేరుకుపోయిన మురుగు ప్రాంతాల్లో ఈ వాటర్ బాల్స్‌ను వేసినట్లు చెప్పారు. వాటర్ బాల్స్ ద్వారా తేలిక పద్ధతిలో ఈ దోమల నివారణ చేపట్ట వచ్చున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె.పుల్లమ్మ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపయోగంగా వెల్నెస్ సెంటర్

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : మండల పరిధిలోని అన్నేరావుపేటలో ఉన్న వెల్‌నెస్ సెంటర్ ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాదు మూడు నెలల క్రితం ప్రారంభించారు. కానీ ఇప్పటి వరకు ఆ భవనం ప్రజలకు అందుబాటులో లేక నిరుపయోగంగా ఉన్నది. సంబంధిత శాఖ అధికారులు వెల్‌నెస్ సెంటర్ సేవలు అందించాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

రామారావు సంస్మరణ సభ

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు : లింగగూడెం గ్రామం అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన వ్యక్తి మురుకుట్ల రామారావు అని మాజీ మంత్రి నెట్టెం రఘురాం, శాసన సభ్యులు శ్రీ రాంరాజ గోపాల్ అన్నారు. ఇటీవల మృతి చెందిన లింగగూడెం గ్రామ మాజీ సర్పంచ్, నియోజకవర్గ సీనియర్ టిడిపి నాయకులు మురుకుట్ల రామారావు సంస్మరణ సభ సోమవారం నిర్వహించారు.

కుష్టు నిర్మూలనే లక్ష్యం : జెసి



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న జెసి, ఇతర అధికారులు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కుష్టు వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంగా జూలై 18వ తేదీ నుండి ఆగస్టు 2వ తేదీ వరకు ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటి సర్వే నిర్వహిస్తారని కాబట్టి ప్రజలందరూ సహకరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ కోరారు. జాతీయ కుష్టు నివారణా కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం డిస్ట్రిక్ట్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం సోమవారం కలక్టరేట్ సమావేశ హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ సర్వేలో అనుమానంగా ఉన్న వారిని గుర్తించి వైద్యాధికారులు పరిశీలించి వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే మల్టీ డ్రగ్ థెరపీ మందులు వెంటనే అందజేస్తారన్నారు. కుష్టు వ్యాధికి సంబంధించిన మందులు ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా లభిస్తాయన్నారు. చర్మంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు, పొడలు, లావుగా మారిన, నొప్పితోకూడిన నరములు, నరములు తిమ్మిర్లు నొప్పిలేని పుండ్లు, తదితర లక్షణాలు కలవారిని గుర్తించి వెంటనే పరీక్షల నిమ్మిత్తం ఆరోగ్య కేంద్రానికి పంపటం ద్వారా వ్యాధిని వెంటనే గుర్తించటం ద్వారా పూర్తి చికిత్స చేకూరుతుందని తెలిపారు. మొత్తం 1403 టీములు ఏర్పాటు చేయడం జరిగిందని వీరంతా ఇంటింటి సర్వే నిర్వహిస్తూ ప్రతి ఒక్కరిని వ్యాధి లక్షణాలు ఉన్నాయా లేవ అని పరిశీలిస్తారన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి. కె.చంద్రశేఖర రావు, బందరు ఆర్డిఓ ఎం.వాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారణి డాక్టర్ గీత భాయి , జిల్లా లేప్రసి ఎయిడ్స్ అండ్ టిబి శాఖాధికారి డాక్టర్. అంబటి వెంకటరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ పట్టణంలోని పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు దష్టి సారించాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదేశించారు. సోమవారం పురపాలక సంఘ సమావేశ మందిరంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వార్డుల వారీగా పరిసరాల పరిశుభ్రతకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ఎమ్మెల్యే రాముకు వివరించారు. ఈ సందర్భంగా దోమలు, వ్యాధులకు కారకమైన క్రిముల నిర్మూలనకు క్రమం తప్పకుండా ప్రతి వీధిలో ఫాగింగ్, స్ప్రేయింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే రాము ఆదేశించారు. అలాగే రోడ్లపై ,ఖాళీ స్థలాల్లో వర్షం నీరు నిలవకుండా శానిటేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకుంటున్న చర్యలు పారదర్శకంగా ఉండాలని, కింద స్థాయి సిబ్బంది నుండి ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వహించాలని, సచివాలయ కార్యదర్శుల సేవలను కూడా వినియోగించుకోవాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, కమిషనర్ సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ కమిషనర్ కష్ణారావు, మున్సిపల్ డి ఈ ప్రవీణ్, జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మున్సిపల్ ఏఈలు, సానిటేషన్ ఇన్స్పెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాజీ సిఎంపై కేసు.. కక్ష సాధింపు చర్య : సింహాద్రి



సమావేశంలో మాట్లాడుతున్న సింహాద్రి రమేష్ బాబు

ప్రజాశక్తి-అవనిగడ్డ : మూడు సంవత్సరాల క్రితం సుప్రీంకోర్టు తిరస్కరించిన మాజీ ఎంపీ రఘురామకష్ణం రాజు కేసు తిరగతోడి తాజాగా మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి, ఐపీఎస్ అధికారులు సునీల్ కుమార్, సీతారామాంజనేయులు గుంటూరు వైద్యశాల విశ్రాంతి సూపర్డెంట్‌లపై కేసు నమోదు చేయడం కక్ష సాధింపు చర్యనని అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ఆరోపించారు. సోమవారం పార్టీ కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం మారిన తర్వాత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుల పైన అప్పటి అధికారుల పైన కక్ష సాధింపు చర్యలకు కోరుకుంటున్నారన్నారు. అదేవిధంగా పోలవరాన్ని తామే నిర్మించినట్లు ప్రారంభించి గొప్పలు చెప్పుకుంటున్నారని, మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి దానికి అంకురార్పణ చేశారని, నీటి సరఫరాకు కావలసిన కాలువలను తవ్వి జలయజ్ఞాన్ని నిర్వహించారన్నారు. దానిపై కూడా ఎన్నో విమర్శలు చేసిన వారు ఇప్పుడు పోలవరాన్ని తామే నిర్మిస్తున్నట్లు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటు అన్నారు. అదేవిధంగా ఐదేళ్లపాటు పట్టిసీమను నిర్వీర్యం చేశారంటూ మాట్లాడుతున్నారని గత ఐదేళ్లుగా పట్టిసీమ అవసరం లేకుండా రైతులు పంటలు పండించుకున్నారన్నారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే వర్షాలు లేక జలాశయాలు ఎండిపోయి పంటలు వేసుకోలేక రైతులు ఎదురుచూస్తున్న తరుణంలో పట్టిసీమ అవసరం నేడు ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, గ్రామ మాజీ సర్పంచ్ నలుకుర్తి పధ్విరాజు, మండల కాప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాష, మండల యూత్ కన్వీనర్ చింతపూడి బాలు పాల్గొన్నారు.



కెఎల్ రావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-కంకిపాడు : అపర భగీరధుడుగా పేరుగాంచిన కంకిపాడు వాసి, ప్రముఖ ఇంజనీర్, డాక్టర్ కానూరు లక్ష్మణరావు (కేఎల్‌రావు) జ్ఞాపకార్ధంగా కంకిపాడు గ్రామంలో ఆయన పేరు మీదుగా ఏదైనా ఒక స్మారక కేంద్రం ఏర్పాటు చేయాలని డాక్టర్ కే ఎల్ రావు విజ్ఞాన వేదిక కన్వీనర్ సుబ్బారావు కోరారు. డాక్టర్ కే ఎల్ రావు గారి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి విజ్ఞాన వేదిక నాయకులు కె నాంచారయ్య పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ డాక్టర్ కే ఎల్ రావు మనదేశంలో, ప్రపంచ వ్యాప్తంగా కూడా గొప్ప ఇంజనీరుగా పేరు ప్రఖ్యాతలు గాంచి, పార్లమెంటు సభ్యులుగా, కేంద్రమంత్రిగా ఎంతో నిరాడంబరంగా ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో పి రంగారావు, టి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

‘మీకోసం’లో సమస్యల వెల్లువ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం చిన్న అవుటుపల్లి గ్రామంలోని ఎస్ఎం కళ్యాణ మండపం లో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి సోమవారం గన్నవరం నియోజకవర్గస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక - మీకోసం కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అర్జీలను నమోదు చేసేందుకు మండలాల వారీగా ప్రత్యేకంగా 18 కౌంటర్లను ఏర్పాటు చేశారు. అర్జీలు ఇచ్చేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గంలోని గన్నవరం, బాపులపాడు,ఉంగటూరు మండలాల్లోని ప్రజల నుండి అనూహ్య స్పందన లభించిందన్నారు. ఈ సందర్భంగా గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు మండలాలకు చెందిన పలువురు తమ సమస్యలను కలెక్టర్, ఎంఎల్ఎకు విన్నవించారు.

అలాగే గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్, అతని అనుచరులు కలిసి గన్నవరంలోని తమ స్థలాన్ని అక్రమంగా ఆక్రమించారని సుంకర సీతామహాలక్ష్మి ఫిర్యాదు చేశారు. సుంకర అనిల్, మేచినేని బాబు మేనల్లుడు సముద్రాల వెంకట శివరామకష్ణ ఇందులో నిందితులుగా ఉన్నారని ఆమె కలెక్టర్‌కు చెప్పారు.

అలాగే గన్నవరం మేజర్ గ్రామ పంచాయతీలో తీరని సమస్యగా మారిన చెత్త నిర్మూలనా, నిల్వలు (డంపింగ్ యార్డు)కు స్థలం కేటాయించి శాశ్వత పరి ష్కారం చూపాలని సర్పంచ్ నిడమర్తి సౌజన్య నాగేశ్వర రావు కలెక్టర్ బాలాజీకి వినతి పత్రం సమర్పించారు.


అలాగే తన పొలానికి, ఇంటి స్థలానికి కోర్టులో కేసులు ఉన్నట్లు దొంగ జడ్జిమెంట్ కాపీలు తయారు చేసి వాటిని ఉపయోగించి గన్నవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తమ ఆస్తులను ప్రోహిబిటెడ్ లాండ్‌గా మార్క్ చేసిన సమస్య పరిష్కరించాలని కేసరపల్లి మాజీ వార్డు సభ్యులు, రైతు మూల్పూరు మాధవన్ కలెక్టర్ ను వేడుకున్నారు.



మీకోసంలో కలెక్టర్‌కు అర్జీలు అందిస్తున్న దృశ్యం

అలాగే ఎంతోమంది ప్రభావంతులకు నిలయమైన గన్నవరం ప్రాంతంలో క్రీడా ప్రాధికార సంస్థ స్టేడియం నిర్మాణానికి స్థలం కేటాయించాలని జాతీయ కబడ్డీ బంగారు పతక విజేత, రాష్ట్ర వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సంఘం ఉపాధ్యక్షులు ధనియాల నాగరాజు కోరారు. ఈ సమావేశంలో మాజీ శాసన సభ్యులు మూల్పూరి బాలకష్ణ, దాసరి బాలవర్ధన్ రావు, గుడివాడ ఆర్‌డిఓ పి. పద్మావతి, డి.ఎస్.పి జయసూర్య, ఐసిడిఎస్ సిడిపి వెంకటలక్ష్మి, సర్పంచి బడుగు బాలమ్మ, తాసిల్దార్లు పవన్ కుమార్, సుబ్బారావు ఎంపీడీవో సత్య కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

రోడ్లు బాగుచేయాలని వినతి



ప్రజాశక్తి-ఉంగుటూరు : మండలంలో డ్రైనేజీ, అంతర్గత రోడ్ల పరిస్థితి దయనీయంగా ఉందని తక్షణమే మరమ్మ తుల ద్వారా పరిష్కార మార్గాన్ని చూపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టీవీ లక్ష్మణస్వామి కోరారు. సోమ వారం గన్నవరం ఎస్ఎం కళ్యాణ మండపంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో మండలంలో ఉన్నటువంటి వివిధ రకాల సమస్యలపై కష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ, గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు లకు మండల సిపిఎం ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణస్వామి మాట్లాడుతూ మండలంలో అంతర్గత రోడ్లు ప్రమాదకర దశలో ఉన్నాయని డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా ఉందని, అన్నారు. అలాగే కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా గ్రామసభల ద్వారా కౌలు రైతులను గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. అలాగే మండలంలోని ఎలుక పాడు గ్రామంలో అసైన్మెంట్ కమిటీ ద్వారా పేదలకు ఉచితంగా ఇచ్చిన భూమిని ఆన్లైన్ ద్వారా రెవెన్యూ రికార్డులలో చేర్చాలని గ్రామ మాజీ సర్పంచ్ అజ్మీరా వెంకటేశ్వరరావు కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి అజ్మీరా వెంకటేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు పిల్లి రాజారావు, సలీం తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు ప్రాధాన్యత : ఆచంట



మాట్లాడుతున్న ఆచంట సునీత

ప్రజాశక్తి మోపిదేవి : రాష్ట్రంలో మహిళల భద్రతకు కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని టీడీపీ రాష్ట్ర డ్వాక్రా, అంగన్వాడీ సాధికార సమితి అధ్యక్షు రాలు ఆచంట సునీత అన్నారు. సోమవారం ప్రముఖ పుణ్యక్షేత్రం మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం దర్శించుకున్నారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, హెూం మంత్రి వంగలపూడి అనిత రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్, శాంతి భద్రతలు కట్టుదిట్టంగా అమలు చేస్తున్నారని తెలిపారు. వైసీపీ పాలనలో గంజాయి, మద్యం విపరీతంగా పెరిగిపోయి రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగి మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరిగాయన్నారు. తమ ప్రభుత్వంలో హెూంమంత్రి అనిత ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా గంజాయి నిర్మూలనలో గట్టి చర్యలు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మోపిదేవి మండల అధ్యక్షులు నడకుదుటి జనార్దనరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రావి రత్నగిరి, నందిగం శంకర్, కనకయ్య, కటారి సత్యనారాయణ పాల్గొన్నారు.

చిట్టూరి సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : స్వర్ణకా రులు కోసం శివప్రసాద్ చేసిన సేవలు చిరస్మరణీయం అని పలువురు వక్తలు కొనియాడారు.శ్రీ కామాక్షి స్వర్ణకార సంఘం అధ్యక్షులు చిట్టూరి శివప్రసాద్ మతి పట్ల గొడుగుపేటలోని స్వర్ణకార సంఘ కార్యాలయం వద్ద సోమవారం సంతాప సభ ఏర్పాటు చేసారు. ఈ సంద ర్భంగా పలువురు వక్తులు మాట్లాడుతూ శివ ప్రసాద్ సేవలను కొనియాడారు.స్వర్ణకారులకు శివప్రసాద్ ఎనలేని సేవలు చేశారని, కరోనా సమయంలో స్వర్ణకారులకు సంఘ అధ్యక్షుడిగా ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఈ సభలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఎం బాబా ప్రసాద్ ,రాష్ట్ర స్వర్ణకార సంఘ అధ్యక్షులు కర్రి వేణుమాధవ్, రాష్ట్ర స్వర్ణకార సంఘ కార్యదర్శి గడ్డం రాజు, జిల్లా అధ్యక్షులు శివకోటి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హయర్ బస్సుల బదలాయింపుపై ధర్నా

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: జగ్గయ్యపేట డిపోలోని హయర్ బస్సులను వేరే డిపోలకు బదిలీ చేయటాన్ని, డిపోలోని సర్వీసుల డ్యూటీలను మార్పులు చేసి సిబ్బందిని తగ్గించేలా మేనేజ్‌మెంట్ చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని కోరుతూ సోమవారం జగ్గయ్యపేట డిపోలోని ఉద్యోగ సంఘాలు, ఎంప్లాయీస్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్ కలిసి జెఎసిగా ఏర్పడి డిపోలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి ఎ.ఆనంద్, రీజనల్ నాయకులు షేక్.హిమామ్, ఎన్.ఎమ్.యు కార్యదర్శి జి.భాస్కరరావు, అధ్యక్షులు వి.ఆర్.బాబు, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

వేలం ద్వారా రూ.7.37 లక్షలు ఆదాయం

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీ తిరుపతమ్మ ఆలయం వద్ద గల వివిధ రకాల దుకాణాల సముదాయాలకు సోమవారం నిర్వహించిన బహిరంగ వేలం పాటలు ద్వారా రూ.7,37,500లు ఆదాయం సమకూరిందని ఆలయ డిప్యూటీ కలెక్టర్ కె.రమేష్ నాయుడు తెలిపారు. ఆలయ బేడ మండపంలో 20 దుకాణ సముదాయాలకు ఒక సంవత్సరం కాలం పరిమితికి లోబడి నిర్వహించిన బహిరంగ వేలం ద్వారా ఈ ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శ్రీనివాసరావు, ఆలయ అధికారులు, ధర్మకర్తలు, పాటదారులు పాల్గొన్నారు.

జలకళను సంతరించుకున్న వైరా కట్టలేరు వాగు

ప్రజాశక్తి - నందిగామ: నందిగామ మండల పరిధిలోని దాములూరు కూడలి వద్ద ఉన్న వైరా కట్టలేరు వాగు జలకళను సంతరించుకుంది. నిన్న మొన్నటి వరకు ఎడారిని తలపించిన వైరా కట్టలేరు వాగు ఎగువ రాష్ట్రం తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాలకు ఒక్క సారిగా వరద పోటెత్తింది. దీంతో వీరులపాడు, నందిగామ రెండు మండలాలకు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. రాకపోకలు కొనసాగించొద్దంటూ పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు.



కృషి విజ్ఞాన కేంద్రాల స్వర్ణోత్సవం

ప్రజాశక్తి - వత్సవాయి: మక్కపేటలో గ్రామ సచివాలయంలో కెవికెల స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించారు. డాక్టర్ కెఎల్ రావు కృషి విజ్ఞాన్ కేంద్రం, గరికపాడు ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణం రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.కృష్ణం రాజు మాట్లాడుతూ గడచిన 50 సంవత్సరాలలో కృషి విజ్ఞాన కేంద్రాలు రైతులకు అందించిన సేవల గురించి వివరించారు. అనంతరం డాక్టర్ పి.ఎన్.శివప్రసాద్ శాస్త్రవేత్త సేద్య విభాగం జీవన ఎరువుల ప్రాముఖ్యతను గురించి వివరించారు. అనంతరం డాక్టర్. కె.లక్ష్మీ కళ ఉద్యానవభాగం మిరప నర్సరీ, పంటలో తీసుకోవాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. డాక్టర్ ఆర్.ప్రభావతి గృహ విజ్ఞాన శాస్త్రవేత్త వివరిస్తూ చిరుధాన్యాల ప్రాముఖ్యతను రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్య శాస్త్రవేత్త డాక్టర్ టి.జేశ్వంత్ రెడ్డి వర్షాకాలంలో పశువుల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.



హోంమంత్రిని కలిసిన బాధితులు

ప్రజాశక్తి - వన్‌టౌన్: విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో ఇటీవల హత్యకు గురైన శ్రీరాం ప్రసాద్ కుటుంబాన్ని తెలుగు వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షులు దూండి రాకేష్ హోం మంత్రి అనిత వంగలపూడి వద్దకు సోమవారం తీసుకుని వెళ్లారు. ఈ సందర్భంగా శ్రీరాం ప్రసాద్ భార్య తన భర్త హత్య కేసులో నిందితులుగా ఉన్న నలుగురిలో కేవలం ఒక్కరిని మాత్రమే అరెస్ట్ చేశారని పేర్కొన్నారు. నిందితుల్లో మిగతా ముగ్గురు నుంచి తమకు ప్రాణహాని ఉందని శ్రీరాం ప్రసాద్ భార్య హోం మంత్రి అనిత దృష్టికి తెచ్చారు. తనకు, తన కుమార్తెలకు నిందితుల నుంచి రోజూ బెదిరింపు కాల్స్ వస్తున్నాయని ఆమె వాపోయింది. దీనిపై హోం మంత్రి అనిత స్పందిస్తూ నిందితులకు తక్షణమే శిక్ష పడేలా చూస్తామని హామీ ఇచ్చారు. హోం మంత్రిని కలిసిన వారిలో కారంశెట్టి రాధ, వి.గురునాథం, తదితరులు ఉన్నారు.

జిఒ 54ను ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - విస్సన్నపేట: విస్సన్నపేటలో సోమవారం యుటిఎఫ్ సభ్యత్వ నమోదు నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బి.సిహెచ్.సూర్యనారాయణ మాట్లాడుతూ జి.పి.ఎస్ చట్టాన్ని అమలు చేస్తూ ఇచ్చిన జిఒ 54ను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 3, 4, 5 తరగతుల విలీనాన్ని వెనక్కి తీసుకొని ఆ విద్యార్థులను ప్రాథమిక పాఠశాలలోకి పంపాలన్నారు. 117 జిఒను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా పూర్వ గౌరవ అధ్యక్షులు డి.శ్రీనివాస్ రెడ్డి, మండల శాఖ గౌరవాధ్యక్షులు బివి.రామారావు, ఏలూరు జిల్లా కార్యదర్శి పి.వీరకోటి, తదితరులు పాల్గొన్నారు.



పిడబ్ల్యుడి అధికారులకు హైకోర్టులో చుక్కెదురు


ప్రజాశక్తి - నందిగామ: నందిగామ పిడబ్ల్యుడి అధికారులకు హైకోర్టులో చుక్కెదురైంది. గత బుధవారం నందిగామ రైతుపేట డౌన్‌లో విలేకరుల సంఘం అధ్యక్షుడు పిడబ్ల్యుడి కాలువపై అక్రమ నిర్మాణాలు చేశాడని, అక్కడ ఉన్న గోవుల షెడ్‌లను, విలేకరులకు చెందిన బెస్ మట్టాలను తొలగించారు. అయితే ఈ భూమిపై హైకోర్టులో కొద్ది కాలంగా విచారణ నడుస్తోంది. దీనిపై పిడబ్ల్యుడి అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేశారు. దీనిపై విలేకరుల సంఘం అధ్యక్షుడు తిరిగి హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఈ కేసుకు సంబంధించి అధికారులు ఎవరు ఆ స్థలం జోలికి వెళ్లవద్దని, గోశాలను యథాతథంగా ఉంచుకోవచ్చని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అయితే ఇదే సమయంలో విలేకరి సంఘం అధ్యక్షుడిపై దాడి చేసిన వారు తిరిగి అతనిపై ఫిర్యాదు చేశారు. దీంతో నందిగామ పోలీసులు సెక్షన్ 3తో పాటు ఐపిసి 354 సెక్షన్ కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి కూడా హైకోర్టు విలేకరుల సంఘం అధ్యక్షుడిని అరెస్టు చేయవద్దని, రెండు సెక్షన్లకు సంబంధించి 41 నోటీసులు ఇవ్వాలని ఆదేశాలిచ్చినట్లు సమాచారం.

ముందస్తు నష్టపరిహారం చెల్లింపులకు చర్చలు

ప్రజాశక్తి - వత్సవాయి: పోలంపల్లి డ్యాం కరకట్ట మరమ్మతులు చేసేందుకు మునేరు ఆయకట్టు రైతులతో ఎంఎల్ఎ శ్రీరామ్ రాజగోపాల్ సోమవారం సమావేశం నిర్వహించారు. ముచ్చింతల గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఎంఎల్ఎ మాట్లాడుతూ గండి కొట్టిన పోలంపల్లి డ్యాం కరకట్టకు మరమ్మతులు చేస్తుంటే తెలంగాణ రైతులు అడ్డుకుంటున్నారని తమకు అందాల్సిన నష్టపరిహారం చెల్లించిన తర్వాతే మరమ్మత్తులు చేసుకోవాలని తెలంగాణ రైతులు డిమాండ్ చేస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో వారికి డబ్బులు చెల్లించి కట్ట పనులు మొదలు పెట్టే ఆలోచనలో ఉన్నట్లు ఎంఎల్ఎ తెలిపారు. తెలంగాణ రైతులకు చెల్లించాల్సిన రూ.11 లక్షల నష్టపరిహారం నిధులు మంజూరు ఆలస్యం కానున్న నేపథ్యంలో ఆ నిధులను ముందస్తుగా చెల్లించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ విషయమై అయితే నాయకులు పొన్నం బాలాజీ నరసింహారావు, కొమ్మినేని సత్యనారాయణ, నల్లజాల రాజు పలువురు రైతులు ఎమ్మెల్యేతో చర్చల్లో పాల్గొన్నారు.

అమరావతి ఇనాం భూముల సమస్యలపై వినతి

ప్రజాశక్తి - నందిగామ: అమరావతి ఇనాం భూముల సమస్యలను పరిష్కరించాలని ఇనాం భూముల రైతు సంఘం రాష్ట్ర నాయకులు రాటకొండ రామకోటేశ్వరరావు (ప్రెస్), సోమవారం సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథికి వినతిపత్రం అందజేశారు. ఇనాం భూముల రైతు సంఘం రాష్ట్ర నాయకులు కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 25వేల ఎకరాల్లో సుమారు 5 లక్షల మంది ఇనాం భూముల రైతులు ఉన్నారని మంత్రికి వివరించారు. గతంలో టిడిపి ప్రభుత్వంలో ఇచ్చిన ఆర్డినెన్స్ మళ్లీ తీసుకువచ్చి అసెంబ్లీలో తీర్మానం చేయించి రైతు కష్టాలను తొలగించాలని కోరారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న రాష్ట్ర రైతుల సమస్యను కూటమి ప్రభుత్వం పరిష్కరించే దిశగా సహకరించాలని రామకోటేశ్వరరావు మంత్రిని కోరారు. మంత్రి సారథి ఇనాం భూముల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని సానుకూలంగా స్పందించారు.



మృతుల కుటుంబాలకు నష్టపరిహారమివ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - నందిగామ: కంచికచర్ల మండలం పరిటాల క్రషర్ క్వారీ కార్మికుల మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల రూపాయల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం నందిగామ సుందరయ్య భవన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ పరిటాల క్రషర్ క్వారీలో సోమవారం ఉదయం జరిగిన ప్రమాదంలో మృతిచెందిన జి.కొండూరు మండలం చెరువుమాదవరం గ్రామానికి చెందిన దుర్గ రాజు, చెవుటూరు గ్రామానికి చెందిన ఒరిస్సా కార్మికుడు బాబు నాయక్, చెవుటూరు గ్రామానికి చెందిన చత్తీష్ ఘడ్ రాష్ట్రానికి చెందిన రామ్ దేవ్ కుటుంబాలకు రూ.50 లక్షల రూపాయల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్రషర్ క్వారీలకు సరైన పర్యవేక్షణ చేసి మైనింగ్ అధికారులు అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మైనింగ్ అధికారుల సమక్షంలోనే క్రషర్ క్వారీలలో డ్రిల్లింగ్ చేయించాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల రూపాయల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి ఎన్.శ్రీనివాస రావు, సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కటారావు గోపాల్, సిఐటియు నందిగామ నాయకులు కర్రి వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్

నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి - నందిగామ: వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపును ప్రతీ ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలని నందిగామ నియోజకవర్గ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్పష్టం చేశారు. సోమవారం నందిగామ కాకాని నగర్ కార్యాలయంలో 'ఇంకుడు గుంతలకు ప్రాధాన్యత ఇవ్వండి భావితరాలకు నీరందించండి' అను నినాదంతో ఎన్టీఆర్ జిల్లా పర్యావరణ పరిరక్షణ సమితి ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు నందిగామ పట్టణంలో ఇంకుడు గుంతలను ఉద్యమస్ఫూర్తితో ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రతి ఇళ్లు, అపార్ట్‌మెంట్స్, కార్యాలయాలు, పరిశ్రమ ఆవరణలో వీటిని ఏర్పాటు చేయాలని సూచించారు. మన కోసం మన పిల్లల కోసం వాటర్ ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని ఎన్టీఆర్ అమరావతి పరిరక్షణ సమితి అధ్యక్షులు రామిరెడ్డి శ్రీధర్ అన్నారు. అమరావతి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ముద్రించిన పదివేల కరపత్రాలను అందరికీ అందజేశారు. ప్రతి ఇంటికీ వీటిని సిబ్బందితో అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ హేమామాలినీ, ఎఇ శ్రీనివాస్, కాకతీయ అపోలో సంస్థల అధినేత కాపా రవీంద్రనాథ్, ఆసరా ఫౌండేషన్ అధినేత వాసిరెడ్డి వంశీ, పట్టణ టీడీపీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధిలు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధులు బహిష్కరణ

నందిగామ: న్యాయవాదులపై దాడి చేయడాన్ని నిరసిస్తూ నందిగామలో న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించారు. బెజవాడ బార్ అసోసియేషన్ సభ్యులు పుప్పాల శ్రీనివాసరావు, పిల్లా సుధాకర్, ఎర్రంశెట్టి పూర్ణ మహేష్, గొట్టిక శివకృష్ణారెడ్డి తదితర న్యాయవాదులపై కొందరు దుండగులు దాడి చేయడాన్ని నందిగామ బార్ అసోసియేషన్ అధ్యక్షులు నంద్రు బాబు విద్యాసాగర్, బార్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఎక్కిరాల హనుమంతరావు, సీనియర్ న్యాయవాది ఎస్.కరిముల్లా, ఇ పి.రంగారావు, రవికుమార్, భాస్కర్‌రావు స్టాలిన్, మౌలేశ్వరరావు, టి.కాంతారావు, ఖండించారు.

జగ్గయ్యపేట: జగ్గయ్యపేట బార్ ప్రెసిడెంట్ అన్నెపాగ సుందరరావు ఆధ్వర్యంలో కోర్టు విధులను బహిష్కరించి, నిరసన కార్యక్రమం నిర్వహించారు. బార్ ట్రెజరర్ మెట్టెల ఆంజనేయులు, మాజీ బార్ అధ్యక్షులు బద్దుల వెంకట రామయ్య, పసుపులేటి సత్యశ్రీనివాస రావు, యర్రమసు ధనుంజయ, సీనియర్ న్యాయవాదులు నాగేశ్వరరావు, కే, శ్రీనివాసరావు, కరిసే రత్నబాబు, శ్రీనివాసవి, ఎస్ జ్యోతి, శేషుకుమారి, ఎస్ అమ్ములు పాల్గొన్నారు.

దేవస్థానంలో బహిరంగ వేలం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: మండలంలోని వేదాద్రి గ్రామంలో గల శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానంలో యాత్రికులు స్వామి వారికి సమర్పించిన దోవతీలు, అమ్మవార్లకు సమర్పించిన చీరలు ఈ నెల 17వ తేదీ తొలి ఏకాదశి రోజు ఉదయం గం.9 గంటల నుండి దేవాలయ ప్రాంగణంలో అమ్మేందుకు దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వి.యల్.ఇందిరా దత్తు ఆధ్వర్యంలో కార్యనిర్వహణాధికారి, దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో బహిరంగ వేలంపాట నిర్వహించబడును. ఆసక్తి గలవారు పాటలో పాల్గొని స్వామి వారి, అమ్మవార్ల వస్త్రాలు పాడుకోవచ్చని దేవస్థాన ఇఒ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: మండలంలోని అనుమంచిపల్లి గ్రామానికి చెందిన నల్లమెట గోపి (24) అనే వ్యక్తి ఆదివారం రాత్రి బోర్డర్ రెస్టారెంట్ సమీపంలో రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందినట్లు సమాచారం. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. చిల్లకల్లు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆషాడం సారె

ప్రజాశక్తి -ఎ.కొండూరు: మండలంలోని చీమలపాడు గ్రామంలో అంకమ్మ మహాలక్ష్మమ్మ లకు సోమవారం ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో సారె సమర్పించారు. ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవమైన కన్యకా పరమేశ్వరికి కూడా ఈ సందర్భంగా సారె సమర్పించారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్. చిన్న సత్యంబాబు ఎన్టీఆర్ జిల్లా ఆర్యవైశ్య శ్రావణ కమిటీ చైర్మన్ పి పూర్ణచంద్రరావు కే జగత్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ

ప్రజాశక్తి - వన్‌టౌన్: చెత్తా చెదారాన్ని ఇష్టమొచ్చినట్టు సైడు డ్రెయిన్లలో, ఎక్కడ పడితే అక్కడ పడవేయకుండా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి) ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జూలై నెల నుండి ఆగస్ట్ 31 స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 38, 52 డివిజన్ల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సురేంద్రబాబు, రాజు నేతృత్వంలో పరిశుభ్రత పాటించండి - అనారోగ్యాన్ని తరిమికొట్టండి అంటూ బ్యానర్లు చేతబట్టి మల్లిఖార్జునపేట, ఆకులవారి వీధులలో ర్యాలీ నిర్వహించారు.

యథేచ్ఛగా చేపల చెరువుల తవ్వకాలు

ప్రజాశక్తి-పెడన : అనుమతులు లేకుండా అక్రమ తవ్వకాలు నిలిపివేయాలని పరిసర ప్రాంతాల రైతులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణాలు చేసిన ఫలితం కనిపించడం లేదన్న ఆరోపణల వినిపిస్తున్నాయి. వీటిపై ఉన్నతాధికారులు మండల స్థాయి అధికారులతో పాటు కింది స్థాయి అధికారులకు కూడా మెమోలు జారీ చేసిన పనితీరు మాత్రం మా రూటే రొయ్యల, చేపల చెరువుల తవ్వకాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేస్తున్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో రోజురోజుకు చేపల రొయ్యల, చేపల చెరువుల తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. మచిలీపట్నం నుండి నరసాపురం వెళ్లే జాతీయ రహదారి 216 నుంచి దేవరపల్లి వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు పక్కనే గత నాలుగు రోజులుగా చేపల చెరువులు యథేచ్ఛగా చేస్తున్నారు.అంతేకాకుండా చెన్నూరు నుంచి కమలాపురం వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డుకు పక్కనే రెండు భారీ ప్రోక్లైన్లు, డోజర్లతో చేపల చెరువులు తవ్వుతున్నారు. వీటిపై చుట్టుపక్కల వ్యవసాయ భూములన్న రైతులు తమ పంట పొలాలు పూర్తిగా పాడైపోతాయని తాసిల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణాలు చేసి సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇదంతా జరిగి వారం రోజులు గడిచిన నేటికీ వాటిని నిలుపుదల చేయకపోవడం విశేషం. అంతేకాకుండా మండల పరిధిలోని చోడవరంలో భారీ చేపల చెరువులో తవ్వేందుకు బడా బాబు ప్రోక్లైన్లతో ఆదివారం అర్ధరాత్రి తీసుకువచ్చాడు. దీనిని సోమవారం ఉదయాన్నే తన భూముల్లోకి తీసుకు వెళ్తుండగా విషయం తెలుసుకున్న నేలకొండపల్లి, కంచడం, పెనుమల్లి, చోడవరం గ్రామాల రైతులు ప్రోక్లైన్ అడ్డుకున్నారు. అనంతరం తమ వ్యవసాయ భూమి రెండు పంటలు పండుతుందని మధ్యలో ఈ చేపల చెరువులు తవ్వడం వల్ల తమ పంట పొలాలు పూర్తిగా దెబ్బతింటాయంటూ తవ్వకాలను నిలుపుదల చేయాలని సోమవారం తాసిల్దార్ రాంబాబుకు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ఊఛా వెంకయ్య రైతులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

ఒక్కో ఎకరానికి 50వేల పైమాటే

మండలంలోని ఏ గ్రామంలో అనుమతులు లేకుండా చెరువుల తవ్వలంటే తాసిల్దార్ కార్యాలయానికి ఎకరానికి 50 వేల వరకు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బడా బాబులు తవ్వే చెరువులకు ముందుగానే రెవెన్యూ అధికారులు తమ కార్యాలయం సెలవు దినాల్లోని తవ్వకాలు జరుపుకోవాలని సూచిస్తున్నట్లు తెలుస్తోంది. అందువల్లనే ప్రస్తుతం తవ్వకాలు జరుగుతున్న దేవరపల్లి, చెన్నూరు గ్రామాల్లో నెలలో రెండవ శనివారం అయినా శనివారం, ఆదివారం, అలాగే మొహరాన్ని పురస్కరించుకొని మంగళ, బుధవారాలు ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో ఆ రోజుల్లోనే తమ చెరువులో తవ్వకాలు వీలుగా ఉంటుందని చెప్పినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలపై తాసిల్దార్ ఆర్ రాంబాబు ఫోన్లో వివరణ కోరగా అందుబాటులో లేరు. ఆర్ ఐ మణికుమార్ ను వివరణ కోరగా ఆయా గ్రామాల్లోని వీఆర్వోలను పంపించి విచారిస్తామని వివరణ ఇచ్చారు.



దేవరపల్లిలోని ఆదివారం రాత్రి తవ్వకాలు జరుగుతున్న దృశ్యం

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-విజయవాడ : స్థానిక బాలోత్సవ్ భవన్‌లో మంగళవారం నిర్వహిస్తున్న రక్తదాన విబిరంలో పెద్దఎత్తున రక్తదాతలు పాల్గొని రక్తదానం చేయాలని సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ కోరారు. ఈమేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ... కార్మికోద్యమంలో విశేష సేవలందించి మృతి చెందిన సిఐటియు సీనియర్ నాయకులు టి సుబ్బారెడ్డి, యం డేవిడ్, ఎస్ఎం సుభాని జ్ఞాపకార్థంగా సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరంలో ఎక్కువ మంది కత్తదాతలు పాల్గొని, రక్తదానం చేయాలని కోరారు. సిఐటియు నాయకులు, అభిమానులు, ఆయా రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.





యోగా శిక్షణా శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి-గన్నవరం : యోగాతో పిల్లల్లో ఆరోగ్యం పెరుగుతుందని శ్రీ మల్లికార్జున హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు నక్కిన మాధవి లత అన్నారు. సోమవారం స్కూలులో వారం రోజులపాటు జరిగే యోగ శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడుతూ.. పిల్లలు చదువుతోపాటు ఆటపాటల్లో రాణించాలన్నారు. మంచి ఆరోగ్యం ఉంటేనే చదువుకోడానికి వీలు ఉంటుందని, ఆరోగ్యం కోసం రోజు యోగాసనాలు వేయడం మంచిదన్నారు. జీవితంలో యోగ అలవాటుగా మారా లన్నారు. స్కూల్ కరస్పాండెంట్ ఎన్సిహెచ్ రాయుడు, యోగా గురువులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువత నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : రాష్ట్ర నైపుణ్య అభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాల్లోని పద్మావతి మహిళా కళాశాలలో వరల్డ్ యూత్ స్కిల్స్ డేను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఉపాధి కల్పన అధికారి డి. విక్టర్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రానున్న రోజుల్లో యువత తమ నైపుణ్యాలని మెరుగు పరుచుకుని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. స్కిల్ హబ్స్, న్యాక్,అర్ఎస్ఈటిఐల ద్వారా అందిస్తున్న నైపుణ్య అభివద్ధి శిక్షణ కార్యక్రమాల్ని అందుపుచ్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ గోపి నాథ్ అతిథిగా పాల్గొని యువతకు మంచి నైపుణ్యాలు ఉన్నాయని, ప్రపంచం అంతా భారత యువత వైపు చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ , డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్మెంట్ అధికారి ఎస్ శ్రీనివాసరావు నైపుణ్యాభివద్ధి సంస్థ సిబ్బంది డి.వి.సందీప్, తుర్లపాటి మధు తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని వినతి

ప్రజాశక్తి-విజయవాడ : భవన నిర్మాణ కార్మికులకు గుదిబండగా మారిన మెమో 1214ను రద్దు చేసి బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు కార్యకలాపాలు పునరుద్ధరించి, వెల్ఫేర్ క్లయిమ్‌లను అమలు చేయించాలని కృష్ణాజిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) కోరింది. ఈ మేరకు యూనియన్ నాయకులు జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్‌జి సృజనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి నరసింహారావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, వాటిని తక్షణమే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. క్లయిమ్‌లు ఆగిపోవడానికి కారణమైన మెమో 1214ను రద్దు చేసి, అర్హులయిన లబ్దిదారులందరి దగ్గర అప్లికేషన్లు స్వీకరించి, కార్మికులకు లబ్ధిచేకూర్చడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించి, పథకాలను పాత పద్ధతిలోనే అమలు చేయాలన్నారు. వెల్ఫేర్ క్లైయిమ్‌లను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎ వెంకటేశ్వరరావు, యూనియన్ జిల్లా అధ్యక్షులు పి అప్పారావు, నాయకులు వివి రాజు, యం బాబూరావు, షేక్ జానీ, ఎస్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం కార్మికులను తొలగించొద్దని వినతి

ఎన్‌టిఆర్ జిల్లాలో రాజకీయ కారణాలతో మధ్యాహ్న భోజన పథకం కార్మికులను తొలగించరాదని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ నేతలు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ సుప్రజ మాట్లాడుతూ నూతన టిడిపి ప్రభుత్వం వచ్చిన తరువాత జిల్లాలోని పలు మండలాల్లో రాజకీయ కారణాలతో ఏళ్ల తరబడి పని చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులను తొలగించడానికి జరుగుతున్న ప్రయత్నాలను నిలువరించాలని కోరారు. గత 23 సంవత్సరాలుగా ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారాన్ని ఆహారాన్ని వండిపెడుతున్నారని అన్నారు. గంపలగూడెం, రెడ్డిగూడెం, జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల్లోని వంట చేయకుండా ఆపేశారన్నారు. వారికి తిరిగి మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలను అప్పగించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు ఎ వెంకటేశ్వరరావు, కోశాధికారి ఎం శ్రీనివాస్, నాయకులు ఇవి నారాయణ, కె బాలకృష్ణ తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

వేతన బకాయిలు చెల్లించాలని నిరసన

ప్రజాశక్తి-విజయవాడ : ఎపి కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్‌లో వివిధ క్యాడర్లలో పని చేస్తున్న ఉద్యోగుల 16 నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల ఫెడరేషన్ కోరింది. ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రైతు సాధికార సంస్థ జిల్లా కార్యాలయం వద్ద సోమవారం ఉద్యోగులు నిరసన తెలిపి, అనంతరం రైతుసాధికార సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కె నాగేశ్వరరావు మాట్లాడుతూ...ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. గత 16 మాసాల వేతన బకాయిలను వెంటనే చెల్లించడంతోపాటు కనీస వేతనాలు , పిఎఫ్, ఇఎస్ఐ అమలు పరచడంతోపాటు ఉద్యోగులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ శాఖలో రైతు సాధికార సంస్థ ద్వారా ఎపి కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ విభాగంలో ఐసిఆర్‌పి , ఎల్-1, ఎల్-2, మాస్టర్ ట్రైనర్లుగా పని చేస్తున్నామన్నారు. అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్నామన్నారు. తమకిచ్చే చాలీ చాలనీవేతనాలు కూడా 16 మాసాలుగా బకాయిలున్నాయన్నారు. నలలు తరబడి వేతనాలు రాక, కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. పని చేస్తున్న ఉద్యోగులందరికీ పదోన్నతులు కల్పించాలని కోరారు. లేనట్లయితే ఆందోళన చేయాల్సి వస్తోందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా అద్యక్షులు వి సంపతి, ఉపాద్యక్షులు సిహెచ్ రాణి, సహాయ కార్యదర్శి సంజనత్ కుమార్, కోశాధికారి జె శాంతకుమారి, నాయకులు జి వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.



సాంబశివరావుకు సత్కారం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం ప్రాంతానికి చెందిన చిట్టనేని. సాంబశివరావు 2025 సంవత్సరానికి అమెరికాలో జరిగే మిలియన్ డాలర్ రౌండ్ టేబుల్ (ఎం డి ఆర్ టి) సమావేశానికి ఎంపిక కావటం గన్నవరం పట్టణానికే గర్వకారణమని స్థానిక జీవిత బీమా సంస్థ, గన్నవరం శాఖాధికారి జొన్నలగడ్డ శ్రావణకుమార్ అన్నారు. సోమవారం బ్రాంచ్ కార్యాలయంలో సాంబశివరావు అభినందన కార్యక్రమం జరిగింది. బ్రాంచి అధికారులు, సిబ్బందితో పాటు ఎల్ఐసి ఏజెంట్లు సాంబశివరావును సత్కరించారు. శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. మచిలీపట్నం డివిజన్ పరిధిలో ఆయన పేరు ప్రఖ్యాతులు సాధిం చటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో జోనల్ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడ్మి స్ట్రేటివ్ ఆఫీ సర్లు పి.రాజబాబ, వి .శ్రీనివాస కుమార్, డెవలప్మెంట్ ఆఫీసర్లు కె.రవీంద్ర నాథ్, అప్పలనాయుడు, ఏజంట్ల యూనియన్ నాయకులు రాజబాబు, పి. ప్రసాద్, గిరిబాబు, ఎస్ .పి . రంగారావు పాల్గొన్నారు.

గ్యాస్ ఏజెన్సీ బలవంతపు వసూళ్లు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం కార్పొరేషన్ పరిధి లోని కాలేఖన్ పేటలో ఉన్న శ్రీనివాస హెచ్ పి గ్యాస్ కంపెనీలో బలవంతపు వసూళ్లు చేస్తున్నట్లు వినియోగ దారులు తెలుపుతున్నారు. ఈ కే వై సీ పేరు తో రెగ్యులేటర్ ,గ్యాస్ పైప్ కొనాలని కండిషన్ పెట్టి రూ.200 వందలతో కొనాల్సిందేనని, లేదంటే ఈ కె వై సీ చేయడం కుదరదు, మీకు గ్యాస్ రాదు కనెక్షన్ రద్దు చేస్తామని ఇబ్బంది పెడుతున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. కొత్త రెగ్యులేటర్, గ్యాస్ పైప్ కొన్నాము అన్నా వినకుండా కోనాల్సిందే అంటూ బలవంతంగా కొనిపిస్తున్నారని వినియోగదారులు అంటున్నారు. మేము చెప్పినట్లు చేయాలి లేదా మీకు దిక్కున్న చోట చెప్పుకోండి అంటూ ఛీత్కరింపులు చేస్తున్నారని వాపోతున్నారు. అంతేకాదు నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీ డెలివరీ చేయకుండా కాలేఖాన్ పేట నుండి శారదా నగర్ వరకు 1 నుండి 2 కిలో మీటర్ల దూరానికి కూడా గ్యాస్ డెలివరీకి అరవై నుండి డెబ్బై రూపాయల వరకు వసూళు చేస్తున్నారు. ఎందుకు అని ప్రశ్నిస్తే గోడౌన్ ఎక్కడో వుంది ఆ చార్జీలు మీరే ఇవ్వాలి అని వసూళ్లు చేస్తున్నారని వినియోగదారులు అంటున్నారు. మచిలీపట్నంలో ఎక్కడా లేని కండీషన్లు పెట్టి వినియోగదారులను తీవ్ర ఇబ్బందులు పెడుతున్న గ్యాస్ ఏజన్సీపై డి ఎస్ ఓ కఠిన చర్యలు తీసుకోవాలని వినియోగదారుల కోరుతున్నారు.

నందిగామ విద్యార్థికి కేరళలో సీటు

ప్రజాశక్తి - నందిగామ : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న చావల సతీష్ కుమార్ కేరళలోని ప్రతిష్టాత్మకమైన సిరియన్ జాకో బైట్ పబ్లిక్ స్కూల్ తిరువళ్లలో ఉచితంగా విద్యనభ్యసించేందుకు సీటు సంపాదించాడు.



విద్యార్థిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయిని విజయలక్ష్మి

2024 మే 11న జాతీయస్థాయిలో జరిగిన ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచి సీటు సంపాదించాడు. రాజేష్ భారత ప్రభుత్వంచే 8వ తరగతిలో నిర్వహించబడిన ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో ఇంటర్ వరకు స్కాలర్షిప్ పొందేందుకు ఎంపికయ్యాడు. జకోబైట్ పబ్లిక్ స్కూల్‌లో ఇంటర్ వరకు ఉచితంగా విద్య నభ్యసించేందుకు ఎంపిక కావడం పట్ల, పాఠశాల ప్రధానోపాధ్యాయిని పి.విజయలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు అందరూ విద్యార్థిని అభినందించారు.

కెవిఆర్ఎన్‌సిసి విద్యార్థికి పురస్కారం

ప్రజాశక్తి - నందిగామ : తాల్ సైనిక్ ట్రైనింగ్ క్యాంప్ ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్‌లో ఏపీ అండ్ తెలంగాణ డైరెక్టరేట్‌లోని కాకినాడ గ్రూప్ తరపున అబిస్టికల్ ట్రైనింగ్ ఈవెంట్‌లో పాల్గొనికాకాని వెంకటరత్నం కళాశాల ఎన్‌సిసి విభాగానికి చెందిన క్యాడేట్ జి.నాగ పవన్ కుమార్ (ఫైనల్ బిఎ) సిల్వర్ మెడల్ సాధించాడు. ఈనెల 1 నుండి 10వ తేదీ వరకు అనంతపురంలో జరిగిన మొత్తం తొమ్మిది గ్రూపులు పోటీపడిన ఈ విభాగంలో మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా కళాశాల పాలకవర్గ అధ్యక్షులు యర్రం రెడ్డి బాబురావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాయప్ప, ఎన్‌సిసి విభాగం ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ పులి రజనీకాంత్, ఎన్‌సిసి క్యాడేట్స్ అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది నాగ పవన్ కుమార్‌ను అభినందించారు.



వినతిపత్రం ఇస్తున్న దృశ్యం


సంక్షేమ బోర్డు పరిరక్షించాలని వినతి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : కృష్ణా జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు అధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని శాసన సభ్యులు గద్దె రామమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయవాడ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ తూర్పు నగర కార్యదర్శి బి.బెనర్జీ మాట్లాడుతూ గత ప్రభుత్వం విధానాలు వల్ల సంక్షేమ బోర్డు, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి దూరమైందన్నారు. 1214 జీవోని రద్దుచేసి, పెండింగ్ క్లైమ్‌లని వెంటనే లబ్ధిదారు ఖాతాలోకి జమ చేయాలని,సంక్షేమ బోర్డుని పూర్తిస్థాయిలో పున ప్రారంభించాలని కోరారు, భవన నిర్మాణ కార్మికులు ఇసుక ఉచితంగా ఇచ్చినప్పటికీ పనులు ప్రారంభం కాలేదని బిల్డింగ్ మెటీరియల్ ధరలు ఐరన్, కంకర, సిమెంట్ తదితర బిల్డింగ్ నిర్మాణం మెటీరియల్ ధరల పెరిగిపోయాయని వాటిని ప్రభుత్వం నియంత్రణలో ఉండాలని నిర్మాణ మెటీరియల్ ధరలు, తగ్గించాలని కోరారు. ఎమ్మెల్యే స్పందించి కార్మిక శాఖామంత్రి వాసంశెట్టిసుభాష్‌కు అందజేస్తానని ఈ విషయం ప్రభుత్వం దష్టికి తీసుకొస్తామని సంక్షేమ బోర్డు పూర్తిస్థాయిలో అతి త్వరలో కార్మికులకి పనిచేసేలా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా విజయవాడ తూర్పు సిటీ అధ్యక్షులు వి.బి.రాజు, నాయకులు కె.విజయకుమార్, కిరణ్ కుమార్, పి.రవి పాల్గొన్నారు.

అల్ట్రాటెక్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనకు సిఐటియు నేతల వినతి

ప్రజాశక్తి - విజయవాడ : భద్రతా ప్రమాణాలను నిర్లక్ష్యం చేసి, కార్మికుల ప్రాణాలు బలితీసుకున్న అల్ట్రాటెక్ సిమెంట్స్ యాజమాన్యంపై హత్యానేరం కేసు నమోదు చేసి, వెంటనే అరెస్ట్ చేయాలని సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా నాయకులు కోరారు. ఈ మేరకు సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎన్‌సిహెచ్.సుప్రజ, పిల్లి నరసింహారావు, ఇతర నాయకులు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనను కలిసి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ఎన్‌టిఆర్ జిల్లాలో అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో, 9న విటిపిఎస్‌లో, కంచికచర్ల మండలం పరిటాల క్వారీలో ప్రమాదంలో పలువురు కార్మికులు మృతిచెందారని, కొందరు వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు, గాయపడిన వారికి పరిహారం అందించాలని ఆందోళన చేస్తే పోలీసులు యాజమాన్యానికి రక్షణగా నిలిచి ప్రజలపై విశక్షణారహితంగా లాఠీఛార్జి చేసి 26 మందిని గాయపరిచారని పేర్కొన్నారు. ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇనిస్పెక్టర్లు తరుచూ జిల్లాలోని ఫ్యాక్టరీలపై, క్వారీలపై తనిఖీలు చేయాలని కోరారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం చెల్లించాలని, గాయపడిన కార్మికులకు రూ.50 లక్షలు నష్టపరిహారం, పూర్తిగా కోలుకునే వరకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులకు సిమెంట్ బోర్డు నిర్ణయం మేరకు రూ.41,016 వేతనం చెల్లించాలని కోరారు. జగ్గయ్యపేటలో 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని బర్న్ వార్డ్‌తో సహా నిర్మించాలన్నారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ యూనియన్ నేతలు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై క్షుణ్ణంగా పరిశీలించి, తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చినట్లు నాయకులు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సిఐటియు విజయవాడ ఈస్ట్ సిటీ అధ్యక్షులు వివి రాజు, సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం.బాబూరావు, పశ్చిమ సిటీ కార్యదర్శి ఇ.వి.నారాయణ, జిల్లా కోశాధికారి యం.శ్రీనివాస్, నాయకులు పి.అప్పారావు, ఎస్ సుబ్బారెడ్డి తదితరులున్నారు.



సమస్యను కలెక్టర్‌కు వివరిస్తున్న నాయకులు

యూట్యూబర్ల వికృత చేష్టలు అరికట్టాలి

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఇటీవల కాలంలో మహిళలను, విద్యార్థినులను లైంగిక వేధింపులకు గురిచేస్తూ, విశృంఖలత్వంగా వ్యవహరించే సోషల్ మీడియా యూట్యూబర్‌లపై వెను వెంటనే చర్యలు తీసుకొని, కఠిన శిక్షలు విధించాలని మహిళా లోకం గర్జించింది. తరుణీతరంగాలు ఆధ్వర్యంలో సోమవారం ఉదయం సర్వోత్తమ గ్రంథాలయంలో జరిగిన మహిళా గళం రౌండ్ టేబుల్ సమావేశంలో మహిళలు, విద్యార్థినులు, రచయితలు, సమాజ సేవకులు పెద్ద ఎత్తున పాల్గొని తమ గళాన్ని వినిపించారు. తరుణీతరంగాలు అధ్యక్షురాలు డాక్టర్ రావి శారద, తరుణీతరంగాలు కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినులు చిన్నారులు సైతం లైంగిక వేధింపులకు గురౌతున్నారని, అన్నారు .అశ్లీల వ్యాఖ్యలతో సోషల్ మీడియా, యూట్యూబర్లు చేస్తున్న వికృత క్రీడలను నిరోధించడానికి మహిళలను జాగరూకత పరచాలన్నారు. మహిళా నాయకురాలు, మాజీ కార్పొరేటర్ సునీత మాట్లాడుతూ, తెలిసీ తెలియని పసి మొగ్గలైన చిన్నారులు ఈ దశ్యాలను చూస్తే, వారి ఆలోచనల ఊహ మనకు భయం కొల్పుతుందని, దీనివల్ల రాబోవు తరాన్ని నాశనం చేసిన వారమవు తామని అన్నారు. ఈ సందర్భంగా తరుణీతరంగాలు సభ్యులు స్వరూపరాణి, ఉషారాణి, ఏ.సుమబిందు, రాజేశ్వరి, కోపూరి పుష్పావతి, వసుంధర, వైష్ణవిశ్రీ, టి.ఉష, సాయికుమారి తదితరులతో పాటు విద్యార్థినులు కే ఆశ, మహాలక్ష్మి, రజని తదితరులు మహిళలు, ప్రత్యేకించి విద్యార్థినులు ఎదుర్కొంటున్న వేధింపులను వివరించారు. ఈ సందర్భంగా చాప కింద నీరులా విస్తరిస్తున్న ఈ విష సంస్కతిని వెంటనే అరికట్టటానికి తగువిధంగా చర్యలు తీసుకోవాలని మహిళా లోకం కోరుతోందని, లక్ష సంతకాలతో ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తేవాలని ఈ సమావేశం వారు నిర్ణయించారు.



మాట్లాడుతున్న రమాదేవి

విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విద్యార్థులు నేటి పోటీ ప్రపంచానికి ధీటుగా తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వై.సుజనాచౌదరి అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల కంప్యూటర్స్ విభాగం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'సెంటర్ ఫర్ ఫ్యూచర్ స్కిలింగ్' ప్రాంగణాన్ని సోమవారం శాసనసభ్యులు సుజనా చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాపితంగా శాస్త్ర సాంకేతిక రంగాలు చాలా వేగవంతమైన ప్రగతిని సాధిస్తున్నాయన్నారు. కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు ఉసిరిక ఉమామహేశ్వరరావు, తూనికుంట్ల శ్రీనివాసులు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ. నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులకు వారివారి రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. కళాశాల కోశాధికారి హరగోపాల్, ఎస్ఆర్ఎస్వీ బీఈడీ కళాశాల కార్యదర్శి మాజేటి సతీష్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, కే రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సెంటర్ ఫర్ ఫ్యూచర్ స్కిలింగ్ ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న సుజనా

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో 'అల్ట్రాటెక్' మృతుల సంతాప సభ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో పేలుడు సంభవించి నలుగురు మృతి చెందగా మరో 12 మంది గాయపడటానికి కారణమైన అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారం యాజమాన్యంపై హత్య కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్ అన్నారు. మండలంలోని బూదవాడలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో మృతి చెందిన కార్మికులు ఆవుల వెంకటేష్, బాణావత్ స్వామి నాయక్, పరిటాల అర్జున్ రావులకు సంతాప సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాణావత్ స్వామి నాయక్ చిత్రపటానికి మూడవత్ కృష్ణ, ఆవుల వెంకటేష్ చిత్రపటానికి ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్.శ్రీనివాస్, ఐద్వా నాయకులు ఎస్.నాగమణి, పరిటాల అర్జున్ రావు చిత్రపటానికి పరిటాల వెంకటేశ్వర్లు, ఎన్‌సిహెచ్.శ్రీనివాస్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఎన్‌సిహెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని, మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలని, పర్మెనెంట్ కాంటాక్ట్ కార్మికులకు సిమెంట్ బోర్డు నిర్ణయం మేరకు 41016/ వేతనం చెల్లించాలని, చట్టప్రకారం ఫ్యాక్టరీలో ప్రతి ఆరు నెలలకు సేఫ్టీ ఆడిట్ చేయించాలని, తాగునీరు ఇంటింటికి కులాయి ద్వారా ఉచితంగా సరఫరా చేయాలని కోరారు. రాత్రి సమయంలో ఫ్యాక్టరీ వ్యర్థాలను గ్రామాలపై వదలటాన్ని నిలుపుదల చేయాలని, ఒకవేళ వదిలితే ఆయా కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, ఫ్యాక్టరీ తరలించాలని, సిఎస్ఆర్ నిధులను గ్రామానికి వెచ్చించి అభివద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.కమల, ఐద్వా నాయకులు బూచమ్మ, కోటేశ్వరీ, సిఐటియు నాయకులు షేక్ గౌస్ మియా, ఎస్ రామనాథం, బాలు, ప్రజాసంఘాల నాయకులు సోమేశ్వరరావు, మహేష్, వెంకటేశ్వరరావు, కాటారపు గోపాల్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.





సెలూన్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అమ్జద్ హబీబ్ ప్రీమియం సెలూన్‌ను జబర్దస్త్ వర్ష సోమవారం ప్రారంభించారు. ప్రసిద్ధ సెలబ్రిటీ హెయిర్ స్టైలిస్ట్, అమ్జద్ హబీబ్ సెలూన్స్ వ్యవస్థాపకుడైన అమ్జద్ హబీబ్ రెండో సలోన్‌ను విజయవాడ గురునానక్ కాలనీలో అమ్జద్ హబీబ్, విజయవాడ ఎమ్.ఎల్.ఏ గద్దె రామ్మోహన్, మహేష్, షహబుద్దిన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ దేశంలోనే అమరావతి ఒక అత్యంత ప్రతిష్టాత్మక నగరంగా మారనుందని ప్రజలకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు అమరావతిలో లభిస్తాయని అన్నారు. అనంతరం నటి వర్ష మాట్లాడుతూ మన ఆత్మవిశ్వాసమే మన అందాన్ని పెచ్చుతుందని అన్నారు. సెలూన్ వ్యవస్థాపకుడు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో తమ ఈ బ్రాండ్ తీసుకురావడం చాల సంతోషంగా ఉందన్నారు.

గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6, అవిష్కరణ

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ఇటీవల జరిగిన గెలాక్సీ అన్‌ప్యాక్డ్ కార్యక్రమంలో గెలాక్సీ బడ్స్3, గెలాక్సీ బడ్స్3 ప్రోతో పాటు తమ సరికొత్త గెలాక్సీ జెడ్ ఫోల్డ్6, గెలాక్సీ జెడ్ ఫ్లిప్6ని విడుదల చేస్తున్నట్లు సంస్థ ఇంఛార్జి పి. కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త గెలాక్సీ జెడ్ సిరీస్ పరిచయంతో, శాంసంగ్ తమ అత్యంత వైవిధ్యమైన, అనువైన ఫారమ్ ఫ్యాక్టర్‌ని ఉపయోగించడం ద్వారా వినూత్నమైన మొబైల్ అనుభవాలను అందిస్తుందన్నారు. గెలాక్సీ ఏఐ కమ్యూనికేషన్, ఉత్పాదకత, సృజనాత్మకత కొత్త శకాన్ని వేగవంతం చేయడానికి శక్తివంతమైన, తెలివైన, మన్నికైన ఫోల్డబుల్ అనుభవాన్ని ఉపయోగిస్తుంది.అని తెలిపారు.

అన్నేకు నివాళి

ప్రజాశక్తి - భవానీపురం : గుండెపోటుతో మృతిచెందిన గొల్లపూడికి చెందిన టిడిపి నాయకులు అన్నే రామకృష్ణ మృతదేహానికి మంత్రి కొల్లు రవీంద్ర సోమవారం నివాళు లర్పించారు. గనులు, భూగర్భ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. అన్నే రామకృష్ణ నివాసంలో నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢమైన సానుభూతి తెలిపారు.